విజయవాడ
ఆదివారం,
22 ఫిబ్రవరి 2026
సంపుటి: 12, సంచిక: 53
వెల : 5/- పేజీలు : 12

# సినాదం

నిఖార్సైన జర్నలిజం

Published From Vijayawada, Visakhpatnam, Tirupati Editor : Bijigiri Srinivas





# పేదల ఆదాయం పెంచుతాం

## సంక్షేమం అమలులో ఏపీకి దరిదాపుల్లో ఏ రాష్ట్రమూ రాదు

- మార్చి నెలాఖరుకు అన్ని పంచాయతీల్లో 100 శాతం చెత్త సేకరణ
- ఢిల్లీ ఏఐ సదస్సులో కాంగ్రెస్ ప్రవర్తన దారుణం
- చెత్త విషయంలో జపాన్ తరహాలో అలవాట్లు మార్చుకోవాలి
- వినుకొండ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

పేద ప్రజల ఆదాయాన్ని పెంచి వారి జీవితాల్లో ఆనందాన్ని నింపుతామని... ప్రతి ఒక్కరికి ఆనందం పంచేలా కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలకు ఆదాయం పెంచే మార్గాన్ని నేర్పించి వారిని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు.

**వినుకొండ, ఫిబ్రవరి 21**

స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. వినుకొండలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...'పౌరుషాల గడ్డ పల్నాడులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నాం. పల్నాడులో అడుగుపెడితే వచ్చే వైబ్రేషనే వేరుగా ఉంటుంది. ఇటీవల కోటప్పకొండలో శివరాత్రి ఉత్సాహంగా జరిగింది. భక్తులతో దద్దరిల్లింది. కోటప్పకొండ తిరునాళ్లు ఘనంగా నిర్వహించారు. శివరాత్రి ప్రభలు అంటే కోటప్పకొండ ప్రభలే గుర్తుకు వస్తాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా బాగా జరుగుతున్నాయి. నేను గతంలో ముఖ్యమంత్రిగా పచ్చదనం-పరిశుభ్రత,

- మిగతా 3వ పేజీలో

## నాటకాల రాయుళ్లది రోజుకో రాజకీయం

### అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా అది బూతుల పార్టీనే

- కల్తీ నెయ్యి నిందితులను నడి రోడ్డుపై నిలబెడతాం
- కల్తీ అక్రమాల నుంచి తప్పించుకోడానికే హెరిటేజ్ పై నిందలు
- రాష్ట్రాన్ని కాపాడుకోడానికి ప్రజలూ కలిసి రావాలి
- వినుకొండ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

-2లో

## ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 30 బిలియన్ డాలర్లు

### వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం చేసుకుందాం

- భారత ప్రధాని మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా నిర్ణయం
- అరుదైన ఖనిజాల్లో సహకారానికి ఒప్పందంపై సంతకాలు
- అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమన్న మోదీ

-6లో



## ఐదేళ్లలో తరిమేస్తాం

### చొరబాటుదారులను తొలుత ఓటర్ల జాబితా నుంచి తప్పిస్తాం

- మార్చి 31కల్లా నక్సలిజాన్ని అంతం చేస్తాం
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటన

-2లో

దేశంలోకి అక్రమంగా వచ్చిన చొరబాటుదారులను ఐదేళ్లలోపు దేశం నుంచి తరిమేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. అస్సాంలోని రాష్ట్ర పోలీసుల 10వ బెటాలియన్ కోసం రూ.270 కోట్లతో నిర్మించతలపెట్టిన కొత్త ప్రాంగణానికి అమిత్ షా శంకుస్థాపనచేశారు.





# ఢిల్లీపై ఉగ్రకుట్ర

### వెలుగులోకి ఉగ్రవాదుల విధ్వంస ప్రణాళికలు

- భారీ విధ్వంసానికి లష్కరే తైబా ప్రణాళికలు
- ఆలయాలే టార్గెట్.. గుర్తించిన భారత నిఘా వర్గాలు
- దేశ రాజధానితోపాటు అన్ని ప్రధాన నగరాల్లో హైఅలెర్ట్
- చెంచల్‌గూడ జైలు నుంచే కుట్ర జరిగిందని అనుమానాలు

-2లో

దేశ రాజధాని ఢిల్లీ నడొబొడ్డున ఉన్న ఎర్రకోట సమీపంలోని పురాతన ఆలయాలను లష్కరే తైబా అనే ఉగ్రవాద సంస్థ టార్గెట్ చేసింది. ఐఈడీ బాంబులతో వాటి విధ్వంసానికి పక్కా ప్రణాళికలు రచించింది. పాక్‌స్థాన్ కేంద్రంగా ఉగ్రవాద సంస్థ ఈ విధ్వంస రచన చేస్తోందని తాజాగా భారత నిఘా వర్గాలు పసిగట్టాయి.

## రెవెన్యూ శాఖకు నోటీసులిచ్చి.. ఆ భూములు వెనక్కి

### అర్హులకు వారి ప్రాంతాల్లోనే స్థలాలు ఇద్దాం

- 'ఆర్5 జోన్' భూములపై సీఎం ఆదేశం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ సమావేశం

అమరావతి మాస్టర్‌ప్లాన్‌కి విఘాతం కలిగిస్తూ.. బయటి ప్రాంతాలకు చెందిన 51వేల మందికి వైకాపా హయాంలో రాజధానిలో సెంటు చొప్పున కేటాయించిన స్థలాల్ని వెనక్కి తీసుకునేలా రెవెన్యూశాఖకు తుది నోటీసులు ఇవ్వాలని సీఆర్‌డీఏని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.



**అమరావతి, ఫిబ్రవరి 21**

వారిలో అర్హులకు... రాష్ట్రప్రభుత్వ విధానానికి అనుగుణంగా వారి ప్రాంతాల్లోనే ఇళ్లస్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని, అనువైన స్థలాల్ని గుర్తించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం అధ్యక్షతన సీఆర్‌డీఏ 58వ సమావేశం జరిగింది. వైకాపా హయాంలో రాజధానిలో సీఆర్‌డీఏకి చెందిన 900 ఎకరాల్ని రెవెన్యూశాఖకు బదలాయించారు. మాస్టర్‌ప్లాన్‌కి భంగం కలిగిస్తూ... కొత్తగా ఆర్5 జోన్ ఏర్పాటుచేశారు. ఆ భూముల్ని తీసుకున్నందుకు సీఆర్‌డీఏకి చెల్లించాల్సిన నగదు రెవెన్యూశాఖ ఇంతవరకు కట్టలేదు. ఆ కారణంతో... రెవెన్యూశాఖకు తుది నోటీసులు జారీ చేసి, సీఆర్‌డీఏ ఆ భూముల్ని వెనక్కి తీసుకోనుంది.

రాజధాని హరిత ప్రణాళికలో భాగంగా... మొదట రహదారుల పక్కన, పార్కుల్లో మొక్కలు నాటాలని సీఎం ఆదేశించారు. పార్కుల్లో ల్యాండ్‌స్కేప్‌ల్ని ఇప్పుడే అభివృద్ధి చేసినా పాడవుతాయని, ప్రధాన మౌలిక వసతుల పనులు పూర్తయి, జనాభా పెరిగే కొద్దీ... క్రమంగా అభివృద్ధి చేద్దామని ఆయన తెలిపారు. ఇతర దేశాల్లో పార్కుల్ని, వాటి నిర్వహణ విధానాల్ని అధ్యయనం చేయాలని సూచించారు. రాజధానిలో నిర్మాణ

- మిగతా 6వ పేజీలో

## గ్లోబల్ సుంకాలు 10% నుంచి 15% పెంపు

### సవరించిన తాత్కాలిక సుంకాలు వెంటనే అమల్లోకి

- విదేశాలపై చట్టబద్ధంగానే సుంకాలు పెంచానని అమెరికా అధ్యక్షుడి స్పష్టీకరణ
- తనకు 150 రోజులపాటు గడువు ఉందని వెల్లడి
- చట్టబద్ధమైన, నూతన టారిఫ్‌ల కోసం ప్రయత్నిస్తామని ఉద్ఘాటన
- దశాబ్దాలపాటు అమెరికాను దోచుకున్నాయని దేశాలపై ఆగ్రహం

-6లో



## పవన్‌కల్యాణ్ దత్తత గ్రామం కొణిదెలకు కొత్తదశ

### 50లక్షల విరాళంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం

వివిధ పథకాల కింద రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు

పవన్‌కల్యాణ్ చొరవతో నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పవన్‌కల్యాణ్ ఇంటి పేరు, ఆ ఊరి పేరు ఒకటే కావడం విశేషం. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన కర్నూలు జిల్లా పర్యటనలో ఉండగా కొణిదెల గ్రామస్థులు కొందరు తమ గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కోరారు.

-2లో



## పెట్టుబడి వాతావరణానికి నష్టం కలిగించిన వ్యక్తి జగన్

### అలాంటి వ్యక్తి 'యూత్ కాంగ్రెస్' నిరసనలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు నటిస్తున్నారు: లోకేశ్

పెట్టుబడి వాతావరణానికి దేశంలో అత్యంత ఎక్కువ నష్టం చేసిన వ్యక్తి వైకాపా అధినేత జగన్ అని మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు దేశ ప్రయోజనాల కోసం చింతిస్తున్నట్లు నటిం చడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశా రు. దిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూత్ కాంగ్రెస్ నిరసనలపై జగన్ ఆందోళన వ్యక్తం చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఎక్స్ వేదికగా శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు.

-2లో



# పేదల ఆదాయం పెంచుతాం

(మొదటి పేజీ తరువాయి)



నీరు–మీరు, ఆకస్మిక తనిఖీలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాను. స్వచ్ఛాంధ్ర అంటే రోడ్లు ఊడ్చే కార్యక్రమం కాదు. స్వచ్ఛత మన జీవిన విధానంలో భాగం కావాలి' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

'రాష్ట్రంలోని ప్రతి మండలానికో స్వచ్ఛ రథం ఏర్పాటు చేస్తున్నాం. వారానికోసారి రథాలు గ్రామానికి వస్తాయి. ఇళ్లలో పనికి రాని వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసర వస్తువులు ఇస్తారు. అన్నింటికంటే మనకు ముఖ్యమైనది ఆరోగ్యం. ఆరోగ్యం బాగుండాలంటే మంచి పరిసరాలు, శుభ్రమైన కార్యాలయాలు, గ్రామా లు ఉండాలి. నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్రంలో 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకు పోయింది. వర్షాలకు ఆ చెత్త భూమిలో ఇంకి తద్వారా భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి వచ్చింది. నూటికి 97 శాతం మున్సిపాలిటీల్లో ఇంటిం టికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. వచ్చే నెల కల్లా రాష్ట్రం లోని అన్ని పంచాయతీల్లో 100 శాతం ఇంటింటికీ చెత్త సేకరిస్తాం. రాష్ట్రంలో 4,14,004 కుటుంబాలు హోం కంపోస్టింగ్ చేస్తున్నారు. 4,19,288 టెర్రస్ గార్డెన్లు ఉన్నాయి. రాజమండ్రి, కర్నూలు, కడప, నెల్లూరులో రూ.1,254 కోట్లతో పీపీపీ విధానంలో 'వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల'ను మార్చి 15కల్లా వినియోగంలోకి తీసుకువస్తాం'అని సీఎం చంద్రబాబు తెలిపారు.

### ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ

'రాష్ట్రంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధించాం. ప్లాస్టిక్ వల్ల ప్రజలు, పశువుల ఆరోగ్యం దెబ్బతింటోంది. ఘన వ్యర్థాలను ప్రాసెస్ చేసి చెత్త నుంచి సంపద సృష్టించటం, విద్యుత్ ఉత్పత్తి లాంటివి చేస్తున్నాం. చెత్త సేకరణ కోసం ట్రై సైకిళ్లు, ఈ–ఆటోలు, వివిధ యంత్రాలను వినియోగిస్తున్నాం. విశాఖ, గుంటూరులలో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. రాజమండ్రి సహా మరో 5 ప్లాంట్లు త్వరలోనే ఏర్పాటు చేసి చెత్త నుంచి విద్యుత్ తయారు చేసేందుకు చర్యలు చేపడతాం. చెత్త, వ్యర్థాల నిర్వహణలో మన ఆలోచనా తీరు మారాలి. మలేరియా, డెంగ్యూ, డయేరియా లాంటి సంక్రమిత వ్యాధులు తడి వ్యర్థాల కారణంగానే వస్తున్నాయి. జపాన్ లో రోడ్లపై చిన్న కాగితం ముక్క కూడా కనిపించదు. అక్కడి పౌరుల తరహాలో మనమూ కొన్ని అలవాట్లను మార్చుకోవాలి' అని ముఖ్యమంత్రి సూచించారు.

### రాష్ట్రంలో పెను మార్పులు రాబోతున్నాయి

'రాబోయే రోజుల్లో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో పెను మార్పులు తెచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు అందిస్తున్నాం. నేను స్వయంగా కార్యక్రమంలో పాల్గొంటున్నాను. ఇంత పెద్ద సంక్షేమ కార్యక్రమం అమలు చేయడంలో దేశంలోని మరే రాష్ట్రంలోనూ మన దరిదాపుల్లో లేదు. తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందించాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 సిలెండర్లు ఉచితంగా మహిళలకు అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల రూపాయలు మూడు విడతల్లో రైతులకు అందిస్తున్నాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌరుల వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్టు ద్వారా పేదలకు మెరుగైన ఆరోగ్యసేవలు అందిస్తాం. అన్ని నియోజకవర్గాల్లోనూ అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి ఎకరాకు నీరు అందిస్తాం. గిట్టుబాటు ధర వచ్చే పంటలనే రైతులు వేయాలని కోరుతున్నాను. వారసత్వంగా వచ్చే పంటలనే పండిస్తే ఆదాయం తక్కువ వచ్చి ఇబ్బందులు వస్తాయి. రైతుకు టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. ఏఐ ద్వారా వ్యవసాయ నిపుణుణ్ని అందుబాటులోకి తెచ్చి రైతుకు శిక్షణ అందిస్తాం. ఇటీవల బిల్ గేట్స్ రాష్ట్రంలో పర్యటించినప్పుడు మనవాళ్ల టెక్నాలజీ వినియోగాన్ని మెచ్చుకున్నారు. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలో మన రాష్ట్రమే మొదటి స్థానంలో ఉంది. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా చేస్తున్నాం. అందులో భాగంగా వినుకొండను కూడా అభివృద్ధి చేస్తాం. 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. మొదట్నుంచీ డ్వాక్రా మహిళలు నాకు అండగా ఉన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తయారుచేసే బాధ్యత తీసుకున్నాం. సంక్షేమ కార్యక్రమాల అమలుతో ప్రజల జీవితాల్లో వెలుగులు తెస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

### పీ4తో పేదలకు ఆర్థిక చేయూత

'సమాజంలో అట్టడుగున ఉన్నవారిని ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే పీ4 కింద లక్షమంది మార్గదర్శులు... 10 లక్షల మంది పేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. అట్టడుగున ఉండే 20 శాతం బంగారు కుటుంబాలు, పైన ఉండే 10 శాతం మార్గదర్శులు కలిసి పనిచేస్తే రేపటి రోజున ఈ బంగారు కుటుంబాలే మార్గదర్శులు అవుతారు. పీ4 ద్వారా 100 కుటుంబాలను దత్తత తీసుకున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుని అభినందిస్తున్నాను. ఈ పథకం ద్వారా మరింతమంది పేదలకు ఆర్థిక చేయూత అందించేందుకు మరికొందరు ముందుకు రావాలి' అని సీఎం చంద్రబాబు కోరారు. 'ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సదస్సుకు నేను హాజరయ్యాను. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీలను ప్రధాని మోదీ ఆహ్వానించారు. సుమారు 60 దేశాల ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు. విద్య, వైద్యం, వ్యవసాయం సహా వివిధ రంగాల్లో ఏఐ ఏం చేస్తుందో తెలిపారు. ఢిల్లీలో ఇంతమంచి సదస్సు ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ వాళ్లు దారుణంగా ప్రవర్తించారు. ఓవైపు ప్రపంచమంతా టెక్నాలజీలో ముందుకుపోతుంటే.. యువత ప్రయోజనాలు కాపాడాల్సిన పార్టీలు అర్ధనగ్న ప్రదర్శన చేయడం నన్ను బాధించింది. దీన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ తరహా శైలి దేశానికి నష్టం చేస్తుంది. మన రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఏం జరిగిందో చూశాం. ఏపీ అంటే అందరూ ఛీ కొట్టారు. పారిశ్రామికవేత్తలు పారిపోయారు. ఆస్తులు తాకట్టు పెట్టి అప్పులు చేశారు. అరాచక పాలనకు వ్యతిరేకంగా టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి ఎన్నికలకు వెళ్తే ప్రజలు గొప్ప విజయం అందించారు. కొత్త విషయాలు నేర్చుకోవడమే కాకుండా వెంటనే ప్రజల కోసం అమలు చేయడం నాకు అలవాటు. 1995లో ఐటీకి ప్రాధాన్యత ఇచ్చి హైటెక్ సిటీ కట్టాను. 25 ఏళ్లలో దేశంలోనే ఎక్కువ తలసరి ఆదాయం వచ్చే రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. అందుకు మన దూరదృష్టే కారణం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. అమరావతిని క్వాంటమ్ వ్యాలీకి చిరునామా చేస్తాం. విశాఖలో భాగస్వామ్య సదస్సు ద్వారా రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. మెగా డీఎస్సీ ద్వారా 15,600 మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ఎన్డీఏ కూటమిదే. రోడ్ల మరమ్మతులు చేపడుతున్నాం. కరెంటు చార్జీలు పెంచబోం. వినుకొండ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని 1000 పడకల ఆస్పత్రిగా మార్చుతాం. ట్రామా కేర్ సెంటర్, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. వినుకొండలో అగ్రికల్చర్, వెటర్నరీ కాలేజీల ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తాం. బస్టాండ్ ను ఆధునీకరిస్తాం.' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

### స్టాళ్ల సందర్శన... ఉత్పత్తుల పరిశీలన

వ్యర్థాల సేకరణ కోసం వినియోగించే స్వచ్ఛ రథాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ప్రజా వేదిక వద్ద వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లతో పాటు మెప్మా, డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినందిస్తూ సన్మానించారు. దాచేపల్లికి చెందిన స్వచ్ఛ రథం డ్రైవర్ దుర్గారావు, హోం కంపోస్టింగ్ విభాగంలో లక్ష్మీ గోవిందమ్మను ముఖ్యమంత్రి సత్కరించి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, గొట్టిపాటి రవికుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

# ఢిల్లీపై ఉగ్రకుట్ర

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21**

దీంతో కేంద్ర ప్రభుత్వం ఢిల్లీతోపా టు ముంబై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో హైఅలెర్ట్ ప్రకటించాయి. ఢిల్లీ పోలీసులు మహానగర వ్యాప్తం గా ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఎర్రకోట, చాందినీ చౌక్‌లోని ఆలయాల వద్ద పహారా కాస్తున్నారు. ఎత్తున భవనాల పైనుం చి స్నైపర్లు నగరంపై నిఘా ఉంచారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించేం దుకు సీసీ టీవీలను కెమెరాలను పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. బాంబు డిస్పోజల్ స్క్వాడ్లు, డాగ్ స్క్వాడ్లు వ్యూహాత్మక ప్రాంతాల్లో సిద్ధంగా ఉన్నారు. ఈనెల 6న పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో భారీ పేలుడు సంభవించి 31 మంది మరణించారు. ఈ పేలుడు వెనుక భారత్‌కు సంబంధం ఉందని లష్కరే తైబా భావిస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలో విధ్వంసానికి ప్రణాళికలు రచిస్తోందని భారత నిఘా వర్గాలు స్పష్టం చేశాయి. భారత్‌లో మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించాలని లష్కరే తైబా కుట్ర పన్నుతోందని తెలిపాయి. ఉగ్రవాదులు హైదరాబాద్‌లోని చెంచల్‌గూడ జైలు నుంచే ఎర్రకోట సమీపంలోని ఆలయాల విధ్వంసానికి ప్లాన్ చేసినట్లు భారత నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. జైలులో ఉన్న కొందరి ములాఖత్‌కు వచ్చిన వారు ఈ కుట్రకు పాల్పడి ఉంటారని అంచనా వేస్తున్నాయి. అయితే.. ఆ ఆరోపణలను తెలంగాణ జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా ఖండించారు. చెంచల్‌గూడ జైలు నుంచే ఉగ్ర కుట్ర జరిగిందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని కొట్టిపడేశారు. కొన్ని మీడియా ఛానళ్లు, సోషల్ మీడియా వినియోగదారులు అసత్య వార్తలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ నగరంలో ఉగ్రవాదులు పన్నిన విధ్వంస కుట్రను ఆ రాష్ట్ర పోలీసులు భగ్నం చేశారు. పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాదులు కుట్రకు పాల్పడినట్లు గుర్తించారు. పోలీసులు నగరంలో పలుచోట్ల తనిఖీలు చేపట్టి ఒక ఐఈడీ బాంబ్‌ను నిర్వీర్యం చేశారు. ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే జమ్మూకశ్మీర్‌లోని గందర్ బాల్ జిల్లా సాఫాపోరలోనూ భద్రత బలగాలు ఒక ఐఈడీ బాంబ్‌ను నిర్వీర్యం చేశా యి. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని హైకోర్టును పేల్చివేస్తామని, కోర్టు పరిధిలో ఆర్డీఎక్స్ అమర్చామని గుర్తుతెలియని వ్యక్తు లు ఈమెయిల్ పంపించడంతో కోర్టు అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. భద్రతా బలగాలు కోర్టులో సోదాలు నిర్వహించి, ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని తెలిపాయి.

# నాటకాల రాయుళ్లది రోజుకో రాజకీయం

**వినుకొండ, ఫిబ్రవరి 21**

తిరుమల లడ్డూ ప్రసాదంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారంపై సీఎం చంద్రబాబు మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కల్తీ అక్రమాల నుంచి తప్పించుకోడానికే హెరిటేజ్ సంస్థపై వైసీపీ నిందలు వేస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో నిందితుల్ని నడి రోడ్డుపై నిలబెడతామని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. 2024లో అధికారంలోకి వచ్చాక ప్రక్షాళన ప్రారంభిం చామని అన్నారు. నెయ్యి నమూనాలను నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డుకు పంపిస్తే కల్తీ జరిగినట్లు నివేదిక అందించిందని.. అది అసలు నెయ్యి కాదని తేలిందని స్పష్టం చేశారు. రసాయనాలతో నెయ్యి తయారు చేసి ప్రసాదంలో వినియోగించినట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం సెట్ తన నివేదికలో కూడా పేర్కొందని స్పష్టం చేశారు. వినుకొండలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ప్రజా వేదిక బహిరంగ సభలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. గత పాలకులు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అత్యంత నాసిరకంగా తయారు చేయించారని..2024 కంటే ముందు తిరుమల దర్శనానికి వెళ్లిన వారంతా ఈ అంశాన్ని గుర్తించారని అన్నారు. శ్రీవారి ప్రసాద పవిత్రతను దెబ్బతీసే అధికారం ఎవ్వరికీ లేదని అలాంటి ప్రసాదాన్ని గత పాలకులు అపవిత్రం చేశారని వ్యాఖ్యానించారు. వారు కొనుగోలు చేసిన నెయ్యిని పరీక్షిస్తే జంతువుల కొవ్వు కలిసినట్టు ల్యాబ్ నివేదిక వచ్చిందన్నారు. దీనిపై సెట్ ఏర్పాటు చేస్తే సరఫరా చేసింది నెయ్యే కాదని తేలిందన్నారు. ఆ తప్పును బయటపెడుతుంటే దానిని ఇతరులపై నెట్టి వేయడానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని అన్నారు. వివేకా హత్య ఘటనలో నాటకాల రాయుడు రోజుకో వేషం వేశాడని ఆక్షేపించారు. చిన్నాన్న కుమార్తె కూడా మోసపోయేలా నాటకాలు రక్తి కట్టించారన్నారు.

### తప్పించుకోవడానికి హెరిటేజ్‌పై నిందలు

గత పాలనలో తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని, అవినీతి జరిగిందని చెబుతుంటే తిరిగి హెరిటేజ్ పై నిందారోపణలు చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. కల్తీ నెయ్యితో ప్రసాదాన్ని కల్తీ చేసిన వ్యక్తులు ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించారు. దొంగే దొంగా దొంగా అనే పరిస్థితి వచ్చిందని.. నిందితుల్ని చట్టం ముందు నిలబెడతామని సీఎం స్పష్టం చేశారు. మసీదు, చర్చి, దేవాలయం ఏదైనా వాటి పవిత్రత కాపాడాలని...ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టగానే టీటీడీలో ప్రక్షాళన చేపట్టామని అన్నారు. శాసన మండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు వెంకటేశ్వర స్వామి ఫొటోలను చెప్పులతో తీసుకెళ్లారని..సభలో రాజకీయం చేసి అనంతరం వేంకటేశ్వరస్వామి ఫొటోలను అక్కడే పడేశారని వ్యాఖ్యానించారు. వారికెందుకు ఇంత అహంకారం అని సీఎం ప్రశ్నించారు. గత పాలనలో రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం చేసి పరిశ్రమల్ని తరిమేశారని .. ఆంధ్రప్రదేశ్ కు ఉన్న నమ్మకాన్ని పోగొట్టారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలు, భవిష్యత్ ఆదాయం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని ఆక్షేపించారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పునర్నిర్మాణం ప్రారంభమైందని అన్నారు.

రాష్ట్రంలో కొందరు చెత్త రాజకీయాలు, రౌడీ రాజకీయాలు చేస్తున్నారని సీఎం ఆరోపించారు. పరామర్శలకు అని వెళ్లి వాళ్ల కార్ల కింద మనుషుల్ని చంపేస్తారని అన్నారు. బూతులు తిట్టిన వాళ్లను.. రౌడీయిజం చేసిన వాళ్లను పరామర్శించే వ్యక్తులు కారు కింద పడిన వారిని మాత్రం పరామర్శించరని సీఎం విమర్శించారు. వైసీపీ నేతల బూతు వ్యాఖ్యలపైనా సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. గతంలో అసెంబ్లీలో తన సతీమణిపై దుర్భాషలాడి వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని...అధికారంలో ఉన్నా విపక్షంలో ఉన్నా ఆ పార్టీ బూతులు మాట్లాడటం మానలేదని అన్నారు. వారితో తిట్టించు కోవడానికే రాజకీయం చేస్తున్నామా? అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆబోతుల మాదిరిగా తయారై రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని.. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యతలో ప్రజలూ కలిసి రావాలని సీఎం వ్యాఖ్యానించారు. చెడును నిరాకరించే పరిస్థితి ప్రజల్లో వచ్చినప్పుడే రాజకీయాల ప్రక్షాళన జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ఉన్నపళంగా అరెస్టు చేస్తున్నట్టు చెప్పి తనను జైల్లో వేశారని అక్కడి నుంచి బయటకు రారని తనకు చాలా మంది చెప్పారని అన్నారు. అయినా కేవలం ప్రజల కోసం రాష్ట్రం కోసమే ఇప్పటికీ పోరాటం చేస్తున్నానని సీఎం వ్యాఖ్యానించారు. గత పాలకులు రాష్ట్రాన్ని గంజాయి మయం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మత్తు సేవించి ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందనే భయంతో మదనపల్లి అత్యాచార కేసులో మృగాడు ప్రాణాలు తీసుకున్నాడని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకే తన తొలి ప్రాధాన్యమని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో కొందరు చెత్త రాజకీయాలు రౌడీ రాజకీయాలు చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు.



# పెరుగుతున్న ఎండలు

## నందిగామలో 37 డిగ్రీలు.. బలపడనున్న అల్పపీడనం

**అమరావతి, ఫిబ్రవరి 21**

రాష్ట్రంలో ఎండ తీవ్రత క్రమేపీ పెరుగుతోంది. శనివారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలోనే అత్యధికంగా కర్నూలు, నందిగామల్లో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీ, శివారు ప్రాంతాల్లో మాత్రం రాత్రిపూట చలి ప్రభావం కొనసాగుతోంది. కాగా శనివారం ఉదయం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయువ్యంగా పయనించి నైరుతి బంగాళాఖాతం, హిందూ మహాసముద్రంలో ప్రవేశించింది. రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయువ్యంగా పయనించి మరింత బలపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో ఆది, సోమవారాల్లో కోస్తా, రాయలసీమలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. తూర్పుగోదావరి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

# పెట్టుబడి వాతావరణానికి నష్టం కలిగించిన వ్యక్తి జగన్

**అమరావతి, ఫిబ్రవరి 21**

పెట్టుబడుల్ని అడ్డుకోవడానికి, పారిశ్రామికవేత్తల్ని బెదిరించడానికి గతంలో జగన్ చేసిన చర్యలని పలు సంఘటనల్ని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. "2017లో ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుకు భంగం కలిగించేందుకు ఎయిర్‌పోర్ట్ వద్ద ధర్నా చేశారు. 2019లో ప్రపంచ పెట్టుబడిదారులతో కుదుర్చుకున్న విద్యుత్తు ఒప్పందాల్ని రద్దు చేశారు. 2020లో అమరావతిలో సింగపూర్ ప్రభుత్వం పెట్టుబడుల్ని అడ్డుకున్నారు. 2025లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న నిధుల సమీకరణను అడ్డుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు లేఖ రాశారు. 2026లో (ఇప్పుడు) ఏఐ సదస్సులో చోటుచేసుకున్న ఘటనపై ఆందోళన అంటూ అకస్మాత్తుగా నటిస్తున్నారు" అని ఎద్దేవా చేశారు.

# పవన్‌కల్యాణ్ దత్తత గ్రామం కొణిదెలకు కొత్తదశ

**అమరావతి, ఫిబ్రవరి 21**

అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కిందటేడాది నందికొట్కూరు నియోజకవర్గ పర్యటనకు వెళ్లి కొణిదెల అభివృద్ధికి రూ.50 లక్షల విరాళం అందించారు. జిల్లా యంత్రాంగం సూచన మేరకు ఆ నిధులతో 90 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్‌హెడ్ నీటి ట్యాంకు నిర్మించారు. కొణిదెల గ్రామానికి 'పల్లె పండుగ 1.0'లో రూ.20 లక్షలకు పైగా వెచ్చించి 3 అంతర్గత రోడ్లు నిర్మించారు. 'పల్లె పండుగ 2.0'లో రూ.45 లక్షలతో చేపట్టిన 7 సీసీ రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. ఉప ప్రణాళిక నిధులతో స్థానిక జిల్లా పరిషత్తు స్కూలు నుంచి పగిడ్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం వరకు 5 కి.మీ. మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోటు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గ్రామం వరకు రోడ్డు పునరుద్ధరణకు రూ.45 లక్షలు ఉప ముఖ్యమంత్రి మంజూరు చేయించారు.

ఆ గ్రామస్థుల అభ్యర్థన మేరకు 4 గోకులాలు, గృహ నిర్మాణశాఖ సహకారంతో 19 ఇళ్లు, నీటితొట్టెలు నిర్మించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రైతుల కోసం 49 ఫీడర్ ఛానళ్లు అభివృద్ధి చేశారు. రెండు చిన్న కాలువల పునరుద్ధరణ, 3 కమ్యూనిటీ చెక్‌డ్యాంలు బాగు చేశారు.

# ఐదేళ్లలో తరిమేస్తాం

**గువాహటి,**



తర్వాత 87వ సీఆర్‌పీఎఫ్ డే పరేడ్‌లో ప్రసంగించారు. ఈశాన్య రాష్ట్రాల్లో సీఆర్‌పీఎఫ్ డే పరేడ్‌లో జరపడం ఇదే తొలిసారి. "అక్రమ వలసదారుల పేర్లు కేవలం ఓటర్ల జాబితాలో తీసేయడమేకాదు అసలు వాళ్లు దేశంలో ఉండకుండా చేస్తాం. అందరినీ స్వదేశాలకు సాగనంపుతాం. వచ్చే ఐదేళ్లలో దీనిని చేసి చూపిస్తాం. గిరిజనుల ప్రాంతంలో చొరబాటుదారుల దురాక్రమణ చెర నుంచి వందల ఎకరాల భూములకు విముక్తి కల్పించాం. అలా విముక్తి పొందిన ఈ 347 ఎకరాల భూమిలోనే కొత్త బెటాలియన్ క్యాంపస్‌ను నిర్మించుకోబోతున్నాం. చొరబాటుదారులను ఏరిపారేస్తామని గతంలో రాహుల్‌గాంధీ పెద్ద ప్రతిజ్ఞలుచేశారు. అవన్నీ అబద్ధాలు. చొరబాటుదారులే కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఓటుగా తయారయ్యారు. చొరబాటుదారులను గుర్తించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే జరుగుతోంది. దీనికి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ ఆందోళనలు చేస్తున్నారు. ఆరోపణల బాంబులు ఒకదానివెంట మరోటి విసురుతున్నారు. అవి కనీసం బాణా సంచా అంతటి స్థాయిలో అయినా పేలట్లేవు"అని అమిత్ షా ఎద్దేవాచేశారు. "జమ్మూకశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ బలగాలు కీలకపాత్ర పోషించాయి. రాళ్లు రువ్వే ఘటనలు ఆగిపోయాయి. ఇక మణిపూర్‌లో జాతుల మధ్య విద్వేషం ఘటనలను తగ్గించడంలోనూ సీఆర్‌పీఎఫ్ అద్భుతంగా పనిచేసింది. కేవలం మూడేళ్లలో మావోయిస్టుల వెన్నువిరిచారు. 12 రాష్ట్రాల్లో, దేశవ్యాప్తంగా అసంఖ్యాక జిల్లాల్లో విస్తరించిన నక్సలిజంను సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు కూకటి వేళ్లతో పెకిలిస్తున్నాయి. సీఆర్‌పీఎఫ్ బలం కారణంగానే మార్చి నెల 31వ తేదీకల్లా దేశం నుంచి నక్సలిజాన్ని శాశ్వతంగా సమూలంగా తుడిచేస్తానని చెప్పగల్గుతున్నా. సీఆర్‌పీఎఫ్ 86 ఏళ్ల చరిత్రలో సీఆర్‌పీఎఫ్ రైజింగ్‌డే వేడుకలు ఈశాన్య రాష్ట్రాల్లో జరగడం ఇదే తొలిసారి. ఇది ప్రతి ఒక్కరు, దేశం గర్వించదగ్గ విషయం"అని షా అన్నారు.

# సాహో.. సేంద్రియ సాగు..





- గేమ్ ఛేంజర్‌గా ప్రకృతి వ్యవసాయం
- విజయవంతంగా ఎన్‌టీఆర్ ఆర్గానిక్ రైతోత్సవం
- జిల్లాలో తొలి విడతగా లక్ష ఎకరాల్లో సాగు దిశగా అడుగులు
- ప్రతి రైతూ ఒక బ్రాండ్ అంబాసిడర్, ప్రతి గ్రామం ఒక క్లస్టర్
- భూమికి, రైతుకు, సమాజానికి బహుళ ప్రయోజనాలు
- విత్తు నుంచి విక్రయం వరకు సమస్త సమాచారం అరచేతిలోనే
- ఇటు రైతులకు, అటు వినియోగదారులకు ప్రయోజనాలు
- ప్రకృతి వ్యవసాయం మన సంస్కృతి.. సమష్టిగా దీన్ని కాపాడుకుందాం
- రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎ.కొండూరు, ఫిబ్రవరి 21** (రాష్ట్రంలో ముఖ్య మంత్రి చంద్రబాబు దార్శనికతకుఅనుగుణంగా ప్రకృతి సాగును మహోద్యమంగాముందుకు తీసుకెళ్లే క్రమంలో సరికొత్త మైలురాయి.రైతులను, వినియోగదారులను, మార్కెటింగ్ విభాగాలు,ప్రకృతి వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలను ఒకేవేదికపైకి తీసుకొస్తూ ఎ.కొండూరు మండలం, కృష్ణారావుపాలెంలో శనివారం నిర్వహించిన ఎన్‌టీఆర్ ఆర్గానిక్‌రైతోత్సవం విజయవంతమైంది. ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, వ్యవసాయ శాఖ, రైతు సాధికారసంస్థ, సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ, శ్రేయాస్‌ఫార్మర్స్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా విస్తృత ప్రజా జాగృతి ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ప్రకృతి సాగు ఉద్యమంలో ప్రతిఒక్కరం భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేశారు.రైతు సాధికార సంస్థ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, బయో ఇన్‌పుట్స్, పీఆర్ఐటీహెచ్‌యూ (రీజెన్ అగ్రికార్బన్ ప్రాజెక్టు), బయో ఎరువులు, పురుగుమందులు, బయో రిసోర్స్ సెంటర్ - మార్కెటింగ్ (బీఆర్‌సీ-మార్కెటింగ్), కార్బన్ క్రెడిట్స్ అండ్ ట్రేసబులిటీ తదితర స్టాళ్లను ఏర్పాటు చేశారు. దేశవాళీ వంగడాలు, జీవామృతం, గో ఆధారిత ఉత్పత్తులు, ఆధునిక యంత్రపరికరాలు, వ్యవసాయ డ్రోన్లు తదితరాలను ప్రదర్శించారు. రేపటి తరానికి సారవంతమైన నేల, ఆరోగ్యకర జీవితాన్ని అందించాలనే లక్ష్యంతో ముందుకు కదులుదామంటూ ప్రోత్సహించిన కళాజాత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రకృతి సేద్య విధానాలను అనుసరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఏడు మంది రైతులను కార్యక్రమంలో సత్కరించారు. రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ వై.సతీష్, క్రాప్ ప్రొడక్షన్ స్పెషలిస్టు డా. పీఎన్ శివప్రసాద్, హ్యూమన్ ఫస్ట్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అండ్ సీఈవో సున్నీ వైస్, ప్రబాల్ తోమర్ (కిసాన్ లెడ్జర్), రఘురాం (భూమి ఆర్గానిక్), ఆషా కిరణ్ (అమరావతి విలేజ్ ఆర్గానిక్), శశి కుమార్ (అక్షయ్ కల్ప ప్రైవేట్ లిమిటెడ్) తదితరులు ప్రకృతి వ్యవసాయ రంగ విజ్ఞానాన్ని అందించారు.

### లక్ష ఎకరాల లక్ష్యం-కార్యాచరణ ప్రారంభం..

రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్ మాట్లాడుతూ సేంద్రియ సాగువల్ల భూమికి, రైతులకు, సమాజానికి బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని, గిరిజన రైతులు ఎక్కువగా ఉండే ఎ.కొండూరు నుంచి సరికొత్త రూపంలో ప్రకృతి వ్యవసాయం మహోద్యమంగా ముందుకెళ్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటగా ఏర్పడిన ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీకి ఛైర్మన్‌గా సేవలందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. పెరిగిన సాగు ఖర్చులు, ఆదాయాల్లో అస్థిరతలు, ప్రజారోగ్యానికి కొత్త సవాళ్లు.. వీటన్నింటికీ పరిష్కారం ప్రకృతి సాగు అని పేర్కొన్నారు. నేడు ప్రపంచ మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తులకు బాగా డిమాండ్ ఉందని.. సరఫరా తక్కువగా ఉందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా రైతులను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

### దార్శనికతకు అనుగుణంగా ట్రేసబులిటీ...

విత్తు ఎంపిక నుంచి పంట కోత, నిల్వ, రవాణా, విక్రయం వరకు ప్రతి దశలో సమాచారాన్ని డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేయడం.. ఈ ట్రేసబులిటీ విధానం ద్వారా వినియోగదారులు కొనుగోలు చేసే ఉత్పత్తి ఎక్కడ పండింది, ఏ సర్వే నంబరులో సాగు చేశారు.. ఏ విధమైన సేంద్రియ ఎరువులు ఉపయోగించారు.. ఇలా సమస్త సమాచారాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకునే ట్రేసబులిటీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిపారు. దీంతో మార్కెట్లో నమ్మకం పెరిగి, రైతులకు మెరుగైన ధరలు, వినియోగదారుని ఆరోగ్యానికి భరోసా కల్పించే వ్యవసాయ ఉత్పత్తులు లభించే అవకాశాలు ఉంటాయన్నారు.

### ప్రతి రైతూ ఒక బ్రాండ్ అంబాసిడర్, ప్రతి గ్రామం ఒక క్లస్టర్...

జిల్లాలో, రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి రైతూ ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా, ప్రతి గ్రామాన్ని ఒక క్లస్టర్‌గా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. మన భూమిని మనం కాపాడుకోవాలి.. మన రైతును మనం గౌరవించుకోవాలి.. మేలైన ఆహారంతో సమాజ ఆరోగ్యానికి భరోసా కల్పించాలి.. ఈ లక్ష్యాలతోనే గౌరవ ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులతో ముందుకెళ్తున్నట్లు దేవదత్ తెలిపారు. జిల్లా కలెక్టర్ గారి ప్రత్యేక చొరవతో ఆర్గానిక్ సాగుకు సరికొత్త ఉత్సాహం వచ్చిందని పేర్కొన్నారు.

### లక్ష ఎకరాలు లక్ష్యంగా అడుగులు...

ప్రస్తుతం జిల్లాలో 42 వేల మంది రైతులు, దాదాపు 50 వేల ఎకరాల్లో ప్రకృతిసాగు జరుగుతోందని.. తొలి విడతలో లక్ష ఎకరాల్లో సాగు లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. పామాయిల్‌లో అంతర పంటలు, ఉద్యాన పంటలు, కూరగాయలు, మిరప వంటి వాటిని పండిస్తున్నట్లు వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంపైనా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల వారీగా రైతుల గుర్తింపు, క్లస్టర్ల ఏర్పాటు, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక మద్దతు, మార్కెట్ లింకేజీలను సమగ్రంగా అమలు చేయనున్నామననారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ స్ఫూర్తి రైతులను తయారు చేసి, వారి ద్వారా ఇతర రైతులకు మార్గనిర్దేశం చేయనున్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించడం ద్వారా నేల సారాన్ని పునరుద్ధరించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. దీని వల్ల భూమి దీర్ఘకాలిక ఉత్పాదకత పెరగడంతో పాటు, రైతుల ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయి. వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి రావడం ద్వారా సమాజ ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యమంలో యూనియన్ కీలక భాగస్వామ్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. విత్తు నుంచి విక్రయం వరకు ప్రతిదశలోనూ సహాయసహకారాలు అందిస్తామని.. గో ఆధారిత ఉత్పతులను కొనుగోలు చేసి, రైతులకు సుస్థిర ఆదాయం అందేలా చూస్తామని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని పండగలా మార్చేందుకు శాయశక్తులా కృషిచేస్తామన్నారు. ప్రపంచ దేశాలు మనవైపు చూసేలా, రాష్ట్రాన్ని సేంద్రియ సాగులో కొత్త దిశగా నడిపించేందుకు కృషిచేస్తామని తెలిపారు.

### కార్బన్ క్రెడిట్లు - అదనపు ఆదాయం..

సేంద్రియ వ్యవసాయ పద్ధతులు గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడంలో సహకరిస్తాయి. దీనివల్ల రైతులు కార్బన్ క్రెడిట్ల రూపంలో అంతర్జాతీయ మార్కెట్ ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలు ఉంటాయని అధికారులు వివరించారు. ఇది సంప్రదాయ పంటల ఆదాయానికి తోడుగా సరికొత్త ఆదాయ వనరుగా మారనుంది. కార్బన్ క్రెడిట్ ప్రాజెక్టులో చేరడం ద్వారా పంటల ద్వారా, కార్బన్ క్రెడిట్ ద్వారా ఆదాయాన్ని పొందొచ్చు. నేల కార్బన్‌ను నిల్వ చేసినప్పుడు కార్బన్ క్రెడిట్లు ఉత్పత్తి అవుతాయి. కంపెనీలు ఈ క్రెడిట్లను కొనుగోలు చేస్తాయి. ఆ చెల్లింపు రైతులకు కార్బన్ ఆదాయంగా లభిస్తుందని నిపుణులు వివరించారు.

### మార్కెటింగ్ -విలువ ఆధారిత ఉత్పత్తులు...

సేంద్రియ పంటలకు ప్రత్యేక మార్కెట్లు, బ్రాండింగ్, ప్యాకేజింగ్, ఆన్‌లైన్ విక్రయ వ్యవస్థల అభివృద్ధిపైనా సదస్సులో మేధోమథన చర్చలు జరిగాయి. స్థానికంగా ఉత్పత్తి చేసిన సేంద్రియ ధాన్యాలు, కూరగాయలు, పప్పులు, నూనెలు, విలువ ఆధారిత ఉత్పత్తులను రాష్ట్ర స్థాయిలో మరియు జాతీయ స్థాయిలో మార్కెట్ చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రైతుల ఆర్థిక స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ, వినియోగదారుల ఆరోగ్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ఎన్‌టీఆర్ జిల్లా సేంద్రియ సాగు విస్తరణలో ఆదర్శంగా నిలవాలని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, నాగసింధు స్పిన్నింగ్ అండ్ జిన్నింగ్ మిల్లు యజమాని శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ప్రకృతి వ్యవసాయ అధికారి, డీపీఎం వై.శంకర్ నాయక్, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, పశుసంవర్ధక అధికారి డా. హనుమంతరావు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

## రామాయణ మహాభారతాలు

# భారతీయ రక్తంలో కలిసిపోయాయి





- డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తితిదే
- జూలేపల్లిలో ఘనంగా ముగిసినతితిదే ధార్మిక కార్యక్రమాలు

**కర్నూలు, ఫిబ్రవరి 21**

వేల సంవత్సరాల దురాక్రమణదారుల విధ్వంసాలను తట్టుకుని ఈ నాటికీ శ్రీమద్రామాయణ, మహాభారతాల ఖ్యాతి తెలుసుకుంటున్నామంటే, అవి భాలతీయుల రక్తంలో కలిసిపోయాయి కాబట్టేనని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గోస్పాడు మండలం, జూలేపల్లి గ్రామంలోని శ్రీ సాయిబాబా మందిరం నందు గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగిం పు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మూడురోజులపాటు శ్రీమద్రామాయణ, మహాభారతం, భగవద్గీతలపై తెలుగు పండితులు డాక్టర్ దోనేపూడి నరేశ్ బాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎ. వి. ఎస్. శర్మ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే నిర్వహించిన భజనలు భక్తులను ఎంతగానో అలరిం చాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ దోనేపూడి నరేశ్ బాబు, నున్న సుబ్బరాయుడు, కె కృష్ణమూర్తి, రెడ్డి మధు, అడపా వెంకటసుబ్బయ్య, కె శివ, మంజుల రాముడుతోపాటు స్థానిక భక్త సమాజాల సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సంపాదకీయం



### మత విభజనల నేపథ్యంలో

## వెల్లివిరిసిన సంఘీభావం

### 1946 నావికాదళ తిరుగుబాటుకు 80 ఏళ్లు

**బ్రిటిష్ వలస పాలనాధికారులు నావికాదళ సైనికుల విప్లవాన్ని తిరుగుబాటుగా చిత్రీకరించ చూశారు. దీనిని స్థానికంగా కట్టుతప్పిన మిలిటరీ క్రమశిక్షణగానో, నావికా ప్రమాణాల రీత్యా పైఅధికారుల ఆదేశాలు పాటించక పోవడంగానో తక్కువ చేసి చూపించేందుకు ప్రయత్నించారు. అయితే ఈ పరిణామాలను సంక్షిప్తంగా పరిశీలించినా ఈ విప్లవ స్థాయి ఏమిటో మనం అర్థం చేసుకోవచ్చు.1946లో చోటుచేసుకున్న రాయల్ నావికదళ తిరుగుబాటుకు ఫిబ్రవరి 18 నాటితో 80 సంవత్సరాలు పూర్తయ్యాయి. బొంబాయిలోని నావికాదళ బారక్‌లలో మొదలైన ఈ సాయుధ విప్లవం అతి వేగంగా వీధులన్నింటా వ్యాపించింది. ప్రజల మద్దతు కూడగట్టుకున్నది.**

సంక్షుభిత కాలంలో అతి స్వల్ప కాలమే మనగలిగినప్పటికీ ఈ విప్లవ ప్రాధాన్యతను 80 ఏళ్ళ తరువాత మరోసారి మననం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. అది కూడా దక్షిణాసియా ఖండంలో మునుపెన్నడూ లేనంత స్థాయిలో మత విశ్వాసాల మధ్య ఉండాల్సిన అంత:సంబంధాలు మరింతగా దిగజారుతున్న నేపథ్యంలో ఈ అవసరం మరింత ఎక్కువగా ఉన్నది.రాయల్ నావికాదళ విప్లవానికి కేంద్ర నాయకత్వం అంటూ లేని కారణం చూపి ఇది స్థానికంగా కట్టుతప్పిన మిలిటరీ క్రమశిక్షణ మాత్రమే. నావికా ప్రమాణాల రీత్యా ఇది పై అధికారుల ఆదేశాలను ధిక్కరించడం మాత్రమేనని పేర్కొంటూ బ్రిటిష్ వలస పాలనాధికారులు ఈ విప్లవాన్ని తక్కువ చేసి చూపించడానికి దీనిని తిరుగుబాటుగా అభివర్ణించారు. కాని ఫిబ్రవరి18-22 తేదీల మధ్య నెలకొన్న పరిణామాలను పరిశీలిస్తే ఈ విప్లవ స్థాయిని మనం అర్థం చేసుకోవచ్చు.1946 ఫిబ్రవరి 18న బొంబాయిలోని హెచ్.యం.ఐ.యస్ తల్వార్ విభాగానికి చెందిన వందలాది మంది రాయల్ నావికాదళ సైనికులు నిరాహార దీక్షకు పూనుకోవడంతో విప్లవానికి బీజం పడింది. నాణ్యత లేని ఆహారం, అతి తక్కువ వేతనాల చెల్లింపు, బ్రిటిష్ అధికారులు వర్ణవివక్షకు పాల్పడడానికి వ్యతిరేకంగా ఈ దీక్ష ప్రారంభమైంది. ఈ వార్త అతి వేగంగా కోట లోపల ఉన్న బారక్‌లకు పాకింది. బొంబాయి రేవులో లంగరు వేసి ఉన్న 22 ఓడలలో సరుకుల ఎగుమతి, దిగుమతులు నిలిచిపోయాయి. ఈ ఓడల మీద కాంగ్రెస్, ముస్లిం లీగ్, కమ్యూనిస్టు పార్టీల జెండాలను ఎగురవేశారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటాలు చేతబూని సైనికులు బొంబాయి పుర వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. నిరాహారదీక్ష శిబిరంలోనే సమ్మె కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక సమస్యలతో పాటు భారతీయ సైన్యాన్ని జైళ్ళ నుండి విడుదల చేయించాలన్న అంశాన్నీ చేపట్టారు.ఫిబ్రవరి 21న శాంతియుత నిరాహార దీక్ష నగరంలో సాయుధ తిరుగుబాటుగా పరిణమించింది. బారక్‌లలో ఉన్న సిపాయిలు బ్రిటిష్ సైనికుల మీద కాల్పులు సాగించారు. ఒడ్డున పోరాడుతున్న సిపాయిలకు దన్నుగా ఓడలలో తిరుగుబాటుకు పూనుకున్నవారు కూడా తుపాకులు చేతబూనడంతో పూర్తి స్థాయి మిలిటరీ యుద్ధం ప్రారంభమైంది. ఆ తరువాత ఐదు రోజుల పాటు ఈ తిరుగుబాటు అటు కరాచీ నుండి బొంబాయికి...మద్రాస్, కొచ్చిన్, అండమాన్ దీవుల రేవులకు విస్తరించింది. 78 ఓడలు, ఢిల్లీ సహా మొత్తం 20 నావికా స్థావరాల్లోని 20,000 మంది సిపాయిలు ఈ విప్లవంలో పాల్గొన్నారు.భారత దేశ వలస పాలనా వ్యతిరేక పోరాటానికి వేగుచుక్క వంటి ఈ విప్లవోద్యమం గురించిన అమూల్యమైన జ్ఞాపకాలు ప్రజల మనసుల్లో అవశేష మాత్రంగా మిగిలాయి. దేశ విభజన కాలంలో చెలరేగిన మత విద్వేషాగ్నుల మూలంగా క్రమంగా ఈ విప్లవోద్యమ స్ఫూర్తి పూర్తిగా అడుగుకి జారిపోయింది.1945లో సిమ్లా సదస్సు వైఫల్యానంతరం దేశంలో పెరుగుతున్న మత ఉద్రిక్తతల నేపథ్యంలో సిపాయిల విప్లవానికి ఉన్న విశాల ప్రాధాన్యతను మనం అంచనా వేసుకోవడం అత్యంత ఆవశ్యకం. బొంబాయి కూడా ఈ మత ఉద్రిక్తతలకు మినహాయింపు కాదు. ఈ నగరంలో కూడా మత ఘర్షణలు చెలరేగాయికానీ 1946 ఫిబ్రవరిలో జరిగిన నావికాదళ సిపాయిల విప్లవం సందర్భంలో స్వల్పకాలికంగానే అయినప్పటికీ అపూర్వమైన మత సామరస్యం వెల్లివిరిసింది. బ్రిటిష్ సైన్యానికి, భారతీయ సిపాయిలకు మధ్య ఘర్షణలు నెలకొన్న నేపథ్యంలో బొంబాయి పురవీధుల్లో హిందూ-ముస్లిం నిరసనకారులు పెద్దఎత్తున ప్రదర్శన సాగించారు. సిపాయిలపై కాల్పులకు నిరసనగా హర్తాళ్ పాటించారు. మధ్యాహ్నం నుండి ప్రదర్శకులు ప్రభుత్వ పోస్టాఫీసుల మీద దాడులు చేశారు. ట్రామ్ పట్టాలు పెకిలించి వేశారు. ఎక్కడికక్కడ రోడ్ల మీద బారికేడ్లు పెట్టారు. రోడ్ల మీద చలిమంటలు రగిలించారు. యావత్ బొంబాయి నగరం స్థంభించిపోయింది. ముస్లిం నివాస ప్రాంతాలైన భేండి బజార్, మిల్ డిస్ట్రిక్ట్ లలో పోలీసులు, కార్మికుల మధ్య రాళ్ళ రువ్వే పోరాటం సాగింది. ఫిబ్రవరి 22 నాటికి ఈ విశాలమైన ప్రజా సంఘీభావం వలస పాలనకు వ్యతిరేకంగా ప్రజా విప్లవంగా రూపుదిద్దుకున్నది. బొంబాయి నగరాన్ని పాలిస్తున్న బ్రిటిష్ అధికారులకు వ్యతిరేకంగా కార్మికులు, విద్యార్థులు, పేదల వాడల్లోని జనం రోడ్ల మీదకు వచ్చారు. ప్రదర్శనలు నిర్వహించారు. అనేకచోట్ల బారికేడ్లు పెట్టారు. రవాణాను విచ్ఛిన్నం చెయ్యడానికి కనబడిన బ్రిటిష్ సైనిక వాహనాలను, బస్సులను తగలబెట్టారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నిరసన పిలుపుల సందర్భంగా స్థబ్దుగా ఉండే ముస్లిం జన సముదాయ నివాస ప్రాంతాలు ఈసారి ఆందోళనకు ప్రధాన కేంద్రాలుగా మారాయి. సామాజికంగా విభిన్న తరగతులు, మతాలకు చెందినవారు ఈ ఉమ్మడి ప్రాంతాలను కాపుకాసి బారికేడ్లు నిర్మించారు. దీంతో నగరంలోని ఇతర ప్రాంతాలకూ ఈ ఉద్యమం విస్తరించింది. త్రివర్ణ పతాకాలు, ముస్లింలీగ్ జెండాలు, ఎర్రజెండాలతో జనం వీధుల్లో భారీగా పోగయ్యారు.బొంబాయి మిల్స్ సెంటర్ ఈ తిరుగుబాటుకు కేంద్రంగా మారింది. అన్ని టెక్స్‌టైల్ మిల్లులు, రైల్వే వర్క్‌షాప్‌లు, ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. వాటితో పాటే స్కూళ్ళు, కాలేజీలు కూడా మూసివేశారు. మిల్స్ సెంటర్ మొత్తం కార్మికులు, పోలీసులతో జనం వీధి పోరాటాలకు తలపడ్డారు. పోలీసు ఠాణాలను అగ్నికి ఆహుతి చేశారు. ఈ ఘర్షణలతో వందలాది మంది గాయపడ్డారు. బ్రిటిష్ ప్రభుత్వం ఈ ప్రజా తిరుగుబాటును అణిచి వెయ్యడానికి ఆయుధ శకటాలను, సైనిక పటాలాలను దించింది.కామాటిపుర, మదన్‌పురా ప్రాంతాలలో హిందూ-ముస్లిం మిల్లు కార్మికులు బారికేడ్లు నిర్మించి మరీ బ్రిటిష్ సైన్యం మీద రాళ్ళు, పెట్రోల్ బాంబులు విసిరి ప్రతిఘటించారు. వందలాది మంది గాయపడ్డారు. ఇంత క్రూరంగా హింసకు పాల్పడుతూ, తీవ్ర అణిచివేతకు పూనుకున్న మిల్స్ జిల్లాను, నగరాన్ని అదుపులోకి తీసుకు రావడానికి బ్రిటిష్ సైన్యానికి కొన్ని రోజులు పట్టింది. ఫిబ్రవరి 23న సిపాయిలు లొంగిపోయినా ఈ ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగాయి.



## ఎమ్మెల్యేను కలసిన బైరెడ్డిపల్లి ఎంపీడీవో ఉపేంద్ర

**బైరెడ్డిపల్లి , ఫిబ్రవరి 21**

పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని బైరెడ్డిపల్లి ఎంపీడీవో ఉపేంద్ర శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అకౌంట్స్ సెక్షన్ ఆఫీసర్ గా పని చేస్తూ ప్రమోషన్ పై బైరెడ్డిపల్లి ఎంపీడీవో గా ఇక్కడికి వచ్చారు. విధుల్లో చేరిన అనంతరం అసెంబ్లీ సమావేశాల నుంచి విచ్చేసిన ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు.

## కార్యకర్త కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఆర్థిక సహాయం



**ఆగిరిపల్లి, ఫిబ్రవరి 22**

ఆగిరిపల్లి మండలం అమ్మవారి గూడెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గజ్జెల రాంబాబు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15,000 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రాంబాబు కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పార్టీ తోడుగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెరుసు సతీష్, మండల పార్టీ అధ్యక్షులు నక్కనబోయిన వేణు, ప్రధాన కార్యదర్శి కొల్లిపర సాంబశివరావు, ఆగిరిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు పామర్తి నరసింహారావు, నరసింగపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు పొన్నం రవికిరణ్, ఎస్.ఎస్. బాబు, అమ్మవారి గూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు జనసూత్రం దుర్గారావు, సర్పంచి జలసూత్రం కొండలరావు, జలసూత్రం లక్ష్మీనారాయణ, జలసూత్రం నరసింహామూర్తి, జనసూత్రం లక్ష్మీనారాయణ, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ వ్యాలీ లో ఘనంగా మాతృబాషా దినోత్సవం




**రామకుప్పం, ఫిబ్రవరి 21**

చిత్తూరు జిల్లా, రామకుప్పం మండల పరిధి రాజుపేట లో ఉండు గ్రీన్ వ్యాలీ పబ్లిక్ స్కూల్ లో ఘనంగా అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. విద్యార్థులు తెలుగు అనే ఆకారం తొ కూర్చోవడం ప్రత్యక ఆకర్షణంగా నిలిచింది.ప్రిన్సిపాల్ జ్యోతీశ్వర్ గాంధీ మాట్లాడుతూ మాతృభాష మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు మన వ్యక్తిత్వానికి ఆధారం. ప్రతి ఒక్కరూ తమ మాతృభాషను గౌరవంగా కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పై ఉంది అని తెలిపారు.ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ జ్యోతీశ్వర్ గాంధీ,ఇంచార్జి శ్రీనివాసులు,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన అధ్యాపక అభివృద్ధి శిక్షణా కార్యక్రమం



**మైలవరం, ఫిబ్రవరి 21**

స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ( ఐక్యూఏసి ) వారి సంయుక్త ఆధ్వర్యంలో "ప్రభావవంతమైన బోధనా పద్ధతులు మరియు వినూత్న బోధనా వ్యూహాలు" అనే అంశంపై 5 రోజుల (ఫిబ్రవరి 16, 2026 నుండి ఫిబ్రవరి 20, 2026) ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ( ఎఫ్ డి పి ) ను నిర్వహించారు . ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. అప్పారావు , ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.పి. లోవరాజు , సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డా. వి. రామకృష్ణ ,కె. సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏఐ ఓ డిఎస్ వక్తలు గా వ్యవహరించారు .నాలుగు రోజుల కార్యక్రమంలో వినూత్న బోధనా పద్ధతుల ద్వారా విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడం ,విద్యార్థుల అభ్యసన అనుభవాన్ని మెరుగుపరచడానికి, ఆధునిక పద్ధతులు, డిజిటల్ సాధనాలతో విద్యార్థులకు ఎలా బోధించాలో, అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ( ఓ బి ఈ ) బ్లూమ్స్ టాక్సోనమీ, ఐ సి టి ఇంటిగ్రేషన్ ఓ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు , యాక్టివ్ మరియు ఎక్స్పీరియెన్షియల్ లెర్నింగ్ టెక్నిక్స్, ఎన్.బి.ఏ / ఎన్ ఏ ఏ సి ప్రమాణాలకు అనుగుణం గా మూల్యాంకన పద్ధతులు గురించి కళాశాల అధ్యాపకులకు వివరించారు. చివరి రోజున కళాశాలలో నిర్మించిన ఏఐసిటిఈ ఐడియా ల్యాబ్, ఇండస్ట్రీ ఇన్నోవేషన్ ల్యాబ్స్ ను సందర్శించారు . ఈ కార్యక్రమానికి కన్వీనర్ గా డా.కె.ఆర్.యల్.ప్రసాద్ , ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ .ఎస్.ఇంద్రసేనా రెడ్డి, శ్రీ.కె.సుధాకర్ కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

# మచిలీపట్నం ఎన్‌జీజీవో హోమ్ నిర్మాణాన్ని పూర్తిచేస్తాం





- ఉద్యోగులకు వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తాం
- మంత్రి కొల్లు రవీంద్ర సహకారం కోరాం
- ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్

మచిలీపట్నం ఎన్‌జీజీవో హోమ్ నిర్మాణాన్ని పూర్తిచేసి, వీలైనంత త్వరగా ఉద్యోగులకు అందుబాటులోకితీసుకొచ్చేందుకు కృషిచేస్తామని.. ఈ విషయంలోమంత్రివర్యులు కొల్లు రవీంద్రగారి సహకారం కోరడంజరిగిందని ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడుఎ.విద్యాసాగర్ అన్నారు. ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడువిద్యాసాగర్ ఆధ్వర్యంలో జిల్లా ఎన్‌జీజీవో నాయకులుఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొలు రవీంద్ర గారినిశనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రతి విషయాన్ని సావధానంగా విన్న మంత్రివర్యులు ఉద్యోగులు ప్రభుత్వం పట్ల ఎంతో సానుకూలంగా ఉన్నారని, ఉద్యోగులకు సంబంధించిన ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ ముందుకెళ్తామని స్పష్టం చేశారు.ఎన్ జి ఓ హోమ్ నిర్మాణం పూర్తి చేయడం ఉద్యోగుల సమస్యల పరిష్కారం లో తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మంత్రి తెలిపారు. అంతకుముందు మచిలీపట్నంలోని ఎన్జీవో హోం ఖాళీ స్థలాలను పరిశీలించి స్థానిక నాయకులతో విద్యాసాగర్ చర్చించారు. భవనాన్ని పూర్తిచేసేందుకు కృషిచేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన వివిధ సమస్యలపై ఉద్యోగులు విద్యాసాగర్‌కు వినతి పత్రాలు అందజేయగా.. వాటిని పరిశీలించి పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. గత ఆరేళ్లుగా ఉద్యోగులకు సంబంధించిన సమస్యలన్నీ పేరుకుపోయాయని, ఏడాది కాలంగా ఒక్కో సమస్యనూ పరిష్కారం చేసుకుంటూ వస్తున్నామని, దాదాపు 14 వేల కోట్ల రూపాయల బకాయిలను ఈ ప్రభుత్వంలో చెల్లించేట్లు చేసుకున్నామని, సంక్రాంతికి కూడా రూ. 1180 కోట్ల డిఏ, డిఆర్ ఎరియర్స్ ను ఉద్యోగులకు మరియు పెన్షనర్స్ కి చెల్లించేటట్లు చూడగలిగామని తెలిపారు. వేతన సవరణ కమిటీ చైర్మన్ ని నియమింప చేసుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా విద్యాసాగర్ అన్నారు. జిల్లా సంఘ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు ఏ విద్యా సాగర్ నిర్దేశించిన షెడ్యూల్లోపే భవాన్ని పూర్తిచేస్తామని, వారిచ్చిన స్ఫూర్తితో వివిధ సంఘాల సంఘ సభ్యుల మరియు తాలూకా సభ్యుల సహకారంతో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యోగులకు ఉపయుక్తంగా ఉండేటట్లు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంఘ భవనాలకు విరాళాలు ప్రకటించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే బిల్డింగ్ కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర కార్యాచరణతో ముందుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీజీవో రాష్ట్ర కార్యదర్శి రజనీష్ బాబు, కృష్ణాజిల్లా ఎన్‌జీజీవో సంఘ కార్యదర్శి సీతారామయ్య, కార్యవర్గ సభ్యులు ప్రకాష్, శోభన్ బాబు, లక్ష్మీ శ్రీనివాస్, శ్రీధర్ పెద్దసంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులతోనే ప్రజలకు సమగ్ర అభివృద్ధి సాధ్యం

### సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి. కృష్ణ



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21** ప్రజలకు సమానత్వం, సామాజిక న్యాయం, మౌలికవసతులు కమ్యూనిస్టు సిద్ధాంతాల ద్వారానేసాధ్యమవుతాయని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శిడి.వి. కృష్ణ పేర్కొన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలోనిసిపిఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలోఆయన మాట్లాడారు. ప్రపంచ కమ్యూనిస్టు తాత్వికులుకార్ల్ మార్క్స్, ఫ్రెడ్రిక్ ఎంగెల్స్ 1848 సంవత్సరంలోరచించిన 'కమ్యూనిస్టు ప్రకటన పత్రం' తొలి ప్రచురణదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న నిర్వహించే 'రెడ్ బుక్ డే' కార్యక్రమాన్ని ఈ సందర్భంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో 'సామ్రాజ్యవాదం అత్యున్నత దశ' అనే గ్రంథంపై అధ్యయనం చేశారు.డి.వి. కృష్ణ మాట్లాడుతూ, సామ్రాజ్యవాద వ్యవస్థలో సంపద కొద్దిమందిలోనే కేంద్రీకృతమై అసమానతలు పెరుగుతున్నాయని అన్నారు. కార్పొరేట్ శక్తులు పాలకులను ప్రభావితం చేస్తూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నాయని విమర్శించారు. ధరల పెరుగుదల, విద్యుత్ చార్జీల భారం ప్రజల జీవనాన్ని కష్టతరం చేస్తున్నాయని తెలిపారు. విదేశీ ఆర్థిక విధానాలు భారత వాణిజ్య, విద్య, ఔషధ రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. చదువుకోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులు భారీ ఖర్చులు భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.కమ్యూనిస్టు పాలనలో అసమానతలు తొలగించి అందరికీ ఉపాధి, విద్య, వైద్యం, సామాజిక న్యాయం కల్పించడం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని, భవిష్యత్తులో ప్రజల హక్కుల కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం. మహేష్, సీనియర్ నాయకులు ఎ. విఠల్ రావు, పట్టణ కమిటీ సభ్యులు ఎస్.కె. భాషా, కె. బేబీ సరోజిని, పి. నవీన్, పార్టీ సభ్యులు కె. నారాయణ, ఎస్. పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

### స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని

# సాధించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

- తెలుగుదేశం పార్టీ ఎన్నికల పోలింగ్ బూత్ యూనిట్ కన్వీనర్ ముని పోలిపల్లి
- భారీ ఊరేగింపుతో స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన సదస్సు




**కృష్ణలంక, ఫిబ్రవరి 21 (**

గద్దె రామ్మోహన్ ఆదేశాల మేరకు శనివారం విజయవాడ తూర్పు నియోజకవర్గం 17వ డివిజన్‌లో రాణి గారి తోట, జండా చెట్టు ప్రాంతాల్లో భారీ ఊరేగింపుతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ ఎన్నికల పోలింగ్ బూత్ యూనిట్ కన్వీనర్ ముని పోలిపల్లి ఆధ్వర్యంలో, సచివాలయం పారిశుద్ధ్య అధికారులు మరియు పారిశుద్ధ్య కార్మికులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ముని పోలిపల్లి మాట్లాడుతూ, స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ కలలు కన్న పరిశుభ్రమైన భారతదేశాన్ని సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాగవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మొకర ఆదిబాబు మాట్లాడుతూ, పారిశుద్ధ్య సాధన దిశగా ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. 2014 అక్టోబర్ 2న ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో ప్రారంభమైన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, అదే స్ఫూర్తితో రాష్ట్రంలో పరిశుభ్రత కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 1995లోనే పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి సారించారని గుర్తుచేశారు. పరిసరాల పరిశుభ్రత, బహిరంగ మలవిసర్జన నిర్మూలన వంటి కార్యక్రమాలు సమాజంలో మార్పు తీసుకువచ్చాయని తెలిపారు. ఇంకా మన పరిసరాల్లో పూర్తిస్థాయి పరిశుభ్రత సాధించాల్సి ఉందని, జపాన్ వంటి దేశాల్లో ప్రజలు రోడ్లపై చెత్త వేయరని ఉదాహరణ ఇచ్చారు. మనం కూడా అలవాట్లు మార్చుకొని పరిశుభ్రమైన వాతావరణాన్ని సృష్టించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వరరావు (కొండ), చింత గోపి, దైద మహేష్, మందులు వీరస్వామి (భద్ర), గోపాలదాస్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న లంక లితిష్

### చిన్నారి పూనర్వికకు ఆర్థిక చేయూత

**మైలవరం, ఫిబ్రవరి 21**




చిన్నారి పూనర్వికకు ఎస్ ఏం ఏ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న సమాచారం తెలిసిన వెంటనే స్పందించి చిన్నారి పునర్వికాకు తెలుగు యువత అధ్యక్షు లు లంక లితీష్ శనివారం పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం మాట్లా డు తూ చిన్నారి పునర్వికాకు వచ్చిన ఈ వ్యాధికి,అత్య వసర చికిత్స, అధిక మొత్తంలో ఖర్చుతో వుందని . చి న్నారి చికిత్స నిమిత్తం సొసైటీ నీడ్స్ యూ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫండ్స్ కలెక్షన్ చేస్తున్నం దున, మీరు చేసే సహాయం ఈ చిన్నారి పెద్ద జీవితవని, ఈ చిన్నారి కి చేసే ఇంజక్షన్ ఎక్కువ ఖర్చుతో ఉందని , ఈ చిన్నారి పునార్విక విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 30 బిలియన్ డాలర్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21**

రాబోయే ఐదేళ్లలో వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 30 బిలియన్ డాలర్లకు చేర్చాలని భారత్, బ్రెజిల్ లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి. అరుదైన ఖనిజాల విషయంలో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయానికొచ్చాయి. ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేశాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా శనివారం ఢిల్లీలో సమావేశ ˘మయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. రక్షణ, ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు తదితర కీలక రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారత్‌బ్రెజిల్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లపై అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపైనా అభిప్రాయాలు పంచుకున్నారు. ఉగ్రవాదం విషయంలో భారత్, బ్రెజిల్ దేశాలది ఒకేమాట అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదులు, ఉగ్రవాద పోషకులు మానవాళికి అతిపెద్ద శత్రువులు అని తేల్చిచెప్పారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు పరిష్కారం కావాలంటే అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరం అని పునరుద్ఘాటించారు. సంస్కరణలకు భారత్, బ్రెజిల్ మద్దతిస్తున్నాయని తెలిపారు. లూలా డా సిల్వాతో భేటీ అనంతరం మోదీ మీడియాతో మాట్లాడారు. లాటిన్ అమెరికాలో భారత్‌కు బ్రెజిల్ అతిపెద్ద వ్యాపార భాగస్వామి అని గుర్తుచేశారు. వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 30 బిలియన్ డాలర్లకు చేర్చడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం అంటే కేవలం అంకెలు కాదని.. విశ్వాసానికి ప్రతిబింబమని వ్యాఖ్యానించారు. భారత్, బ్రెజిల్ మధ్య మొత్తం తొమ్మిది ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్, బ్రెజిల్ మధ్య దశాబ్దాలుగా వాణిజ్య బంధం కొనసాగుతోంది. 202425లో ద్వైపాక్షిక వాణిజ్యం 12 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారత్ నుంచి బ్రెజిల్‌కు ఎగుమతుల విలువ 6.77 బిలియన్ డాలర్లు కాగా, దిగుమతుల విలువ 5.43 బిలియన్ డాలర్లు. అరుదైన ఖనిజాల విషయంలో సహకారానికి బ్రెజిల్‌తో ఒప్పందం కుదిరిందని ప్రధాని మోదీ వెల్లడించారు. సుస్థిరమైన సప్లై చైన్స్ నిర్మించడానికి ఇదొక కీలకమైన చర్యగా అభివర్ణించారు. డిజిటల్ భాగస్వామ్యంపై భారత్, బ్రెజిల్ ఒక ఉమ్మడి డిక్లరేషన్‌ను ఆమోదించాయి. మైనింగ్, ఎంఎస్‌ఎంఈ, ఆరోగ్య సంరక్షణ, సంప్రదాయ విజ్ఞానంపై ఒక అవగాహనా ఒప్పందం(ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. రక్షణ రంగంలో భారత్‌బ్రెజిల్ భాగస్వామ్యం కొనసాగుతూనే ఉంటుందని ప్రధానమంత్రి తేల్చిచెప్పారు. పరస్పర విశ్వాసం, వ్యూహాత్మక సహకారానికి ఇదొక గొప్ప ప్రతీక అని వెల్లడించారు. ఇరుపక్షాలూ లాభపడే భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. భారత్‌బ్రెజిల్ ఒక్కటైతే గ్లోబల్ సౌత్ గొంతుక మరింత బలం పుంజుకుంటుందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య దేశాలుగా కలిసికట్టుగా పనిచేస్తూ గ్లోబల్ సౌత్ ప్రాధాన్యతలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఏ సమస్యనైనా సరే చర్చలు, దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాలన్నదే తమ విధానమని పేర్కొన్నారు జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద దాడులను లూలా డా సిల్వా తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదాన్ని ఏ ఒక్క మతంతో గానీ, జాతితో గానీ ముడిపెట్టొద్దని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ పరిణామాలు అందోళన కలిగిస్తున్నాయని, ఈ తరుణంలో భారత్‌బ్రెజిల్ మధ్య సహకారం, వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత పెరగాలని స్పష్టంచేశారు. గ్లోబల్ సౌత్‌లో భారత్, బ్రెజిల్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలని తెలిపారు. రెండు దేశాలు డిజిటల్ సూపర్ పవర్‌గా, పునరుత్పాదక ఇంధన రంగంలో సూపర్ పవర్‌గా మారాయని వెల్లడించారు. సంఘర్షణ కొనసాగుతున్న తరుణంలో సుస్థిరాభివృద్ధి, శాంతి సాధ్యం కాదని తేల్చిచెప్పారు. 20వ శతాబ్దపు టైప్‌రైటర్లపై 21వ శతాబ్దపు సాఫ్ట్‌వేర్‌ను నడిపించలేమంటూ గత ఏడాది బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను సిల్వా గుర్తుచేశారు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు చేపట్టాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఐరాస భద్రతా మండలిలో సంస్కరణలు అత్యంత కీలకమని చెప్పారు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం పొందడానికి భారత్, బ్రెజిల్‌కు సహజంగానే హక్కు ఉందని స్పష్టంచేశారు. గ్లోబల్ సౌత్ గొంతుకు బలంగా వినిపించాలంటే రెండు దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించాలన్నారు.



## టికెట్ ఉన్నా దర్శనానికి పంపట్లేదు!

- 3 గంటలకు దర్శన సమయం.. వచ్చాక 10 గంటలకు రమ్మంటున్నారు
- సోషల్ మీడియాలో శ్రీవారి భక్తుడి ఆవేదన

**తిరుమల, ఫిబ్రవరి 21**

తమకు జారీ చేసిన టికెట్‌పై వేకువజామున మూడు గంటలకు శ్రీవారి దర్శనమని ముద్రించి, తీరా వచ్చాక ఇప్పుడు కాదు ఉదయం 10 గంటలకు దర్శనానికి రమ్మన్నారంటూ ఓ భక్తుడు మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఓ కుటుంబం శుక్రవారం వేకువజామున మూడు గంటల సమయానికి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు పొందింది. దర్శనం కోసం క్యూలైన్‌లోకి వస్తే తమను అనుమతించలేదంటూ ఓ యువకుడు టీటీడీని ప్రశ్నిస్తూ సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ అంశం చర్చనీయాశంగా మారింది. 'దర్శనం మూడు గంటలకు అని ఇచ్చారు. 2.30 గంటలకు కుటుంబ సభ్యులు, చంటి బిడ్డతో వైకుంఠం క్యూకాంప్లెక్స్ దగ్గరికి వస్తే తిరిగి ఉదయం 10 గంటలకు రమ్మని చెప్తున్నారు. ఈ చలిలో ఎక్కడికి వెళ్లాలి. కనీసం స్పందించే వారు లేరు. విధుల్లో ఉన్నవారు అటూ ఇటూ తిప్పుతూనే ఉన్నారు. సింపుల్‌గా ప్రింటింగ్ మిస్టేక్ అని చెప్తున్నారు. దీనికెవరు బాధ్యులు' అంటూ వీడియోలో ఆ భక్తుడు ప్రశ్నించాడు.

## రెవెన్యూ శాఖకు నోటీసులిచ్చి.. ఆ భూములు వెనక్కి

(మొదటి పేజీ తరువాయి)

పనులు ముమ్మరంగా జరుగుతున్నందున బాగా దుమ్ము లేస్తున్న విషయాన్ని సీఎం ప్రస్తావించారు. దుమ్ము లేవకుండా చూసేందుకు, చెట్లపై పేరుకున్న మట్టిని తొలగించేందుకు రెయిన్‌గన్‌లు వినియోగించాలని సూచించారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, మౌలిక వసతులే అభివృద్ధి చేస్తే సరిపోదని... ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు నిర్మాణాలు చేపట్టేలా చొరవ తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు. రాజధాని పరిధిలోని కొండలనూ అభివృద్ధి చేయాలని, వాటికి ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. కొత్తగా ఏడు సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ, గతంలో కొన్ని సంస్థలకు చేసిన కేటాయింపుల్లో మార్పులు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం ఇటీవల తీసుకున్న నిర్ణయాలకు అథారిటీ ఆమోదం తెలిపింది. భాజపా కార్యాలయానికి గతంలో 2.8 ఎకరాలు కేటాయించగా, సాంకేతిక ఇబ్బందులు రావడంతో, దాన్ని 1.43 ఎకరాలకు తగ్గించి వేరేచోట కేటాయించినట్టు మంత్రి నారాయణ తెలిపారు. శాసనసభ, హైకోర్టు భవనాల ఎంఈపీ పనులకు టెండర్లు పిలిచేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది.

రాజధానిలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనుల పర్యవేక్షణను సీఆర్‌డీఏ నుంచి కొత్తగా ఏర్పాటైన ఏజీఐసీఎల్‌కు బదలాయిస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది.

## రూ.వంద కోట్లతో 'సమగ్ర హ్యాండ్లూమ్ అభివృద్ధి పైలట్ ప్రాజెక్టు'

### చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి

**అమరావతి, ఫిబ్రవరి 21**

రూ.వంద కోట్లతో 'సమగ్ర హ్యాండ్లూమ్ అభివృద్ధి పైలట్ ప్రాజెక్టు' చేపట్టనున్నట్లు చేనేత, జౌళిశాఖ కమిషనర్ జి.రేఖారాణి తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా నాణ్యమైన నూలు సరఫరా, ఆధునిక డిజైన్లు, హోమీ వేతనం తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నం-భీమిలి బీచ్ రోడ్డులోని తిమ్మాపురంలో రూ.172 కోట్లతో యూనిటీ మాల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా ఓడీఓపీ, జీఐ ట్యాగ్ ఉన్న ఉత్పత్తుల్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తామని వివరించారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో రూ.38.31 కోట్లతో మెగా క్లస్టర్ మంజూరైందని. 10,114 మంది కార్మికులకు దీని ద్వారా లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు.



## రేపటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

### ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు

రాష్ట్రవ్యాప్తంగా 1,537 కేంద్రాల్లో సోమవారం (ఈనెల 23) నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు కలిపి 10,57,312 మంది పరీక్ష రాయనున్నారు. ఎలాంటి లోపాలకు తావివ్వకుండా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా నిబంధనల ప్రకారం పరీక్షకు అనుమతించబోమని స్పష్టంచేశారు. విద్యార్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు తమ వ్యక్తిగత వివరాలు ఓఎంఆర్ షీట్‌పై సరిచూసుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా అదనపు బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరామన్నారు. అత్యవసర సమస్యల కోసం బోర్డు కార్యాలయంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1531తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

**ఏర్పాట్లు ఇలా..**

పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, గాలి, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేశారు.

ప్రతి పరీక్ష గదిలో సీసీ టీవీ కెమెరాల నిఘా వ్యవస్థ

మొబైల్స్, స్మార్ట్ వాచ్‌లు, కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.



## విద్యతో పాటు కళలు, క్రీడల్లోనూ రాణించాలి

- వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ పి.అరుల్మోళివర్మన్
- అమరావతిలో ఘనంగా ప్రారంభమైన విటోపియా-2026

**అమరావతి, ఫిబ్రవరి 21**

ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ కీలకమైందని.. ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే విద్యతోనే సాధ్యమని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.అరుల్మోళివర్మన్ అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు కళలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ నైపుణ్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రతిభకు పదును పెట్టాలని ఆకాంక్షించారు. అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వార్షిక క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు 'విటోపియా-2026' శనివారం ఘనంగా మొదలయ్యాయి. ఈ వేడుకలను విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జగదీశ్ చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ ఎస్.గోపీకృష్ణన్, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖదీర్‌పాషా, వైస్ ఛాన్సలర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వివిధ దేశాలు, దేశంలోని అనేక రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వస్త్రధారణతో కూడిన 'వసుధైకం' ర్యాలీ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల విద్యార్థులు జానపద, సంప్రదాయ కళారూపాలతో సందడి చేశారు. వీసీ అరుల్మోళివర్మన్ మాట్లాడుతూ సాంస్కృతిక ప్రదర్శనలు మన మూలాలను, ప్రాచీన సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని చెప్పారు.

# గ్లోబల్ సుంకాలు 10% నుంచి 15% పెంపు

**వాషింగ్టన్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21**

విదేశాలపై టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ప్రపంచ దేశాలపై విధించిన తాత్కాలిక టారిఫ్‌లను 10 శాతం నుంచి 15 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు శనివారం 'ట్రూత్ సోషల్'లో పోస్టుచేశారు. సవరించిన టారిఫ్‌లు వెంటనే అమల్లోకి వస్తాయని తేల్చిచెప్పారు. టారిఫ్‌లపై అమెరికా సుప్రీంకోర్టు శుక్రవారం ఇచ్చిన హాస్యాస్పదమైన, పేలవమైన, అసాధారణ అమెరికా వ్యతిరేక తీర్పు తర్వాత అన్ని అంశాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా అమెరికాను దోచుకుంటున్న దేశాలపై తొలుత 10 శాతం టారిఫ్‌లు ప్రకటించానని తెలిపారు. తాను అధికారంలోకి వచ్చేదాకా ఈ దోపిడీ యథేచ్ఛగా కొనసాగిందని మండిపడ్డారు. 10 శాతం టారిఫ్‌లను చట్టబద్ధంగా 15 శాతానికి పెంచుతున్నట్లు స్పష్టంచేశారు. అమెరికా ట్రేడ్ చట్టం1974లోని సెక్షన్ 122 ప్రకారం ఇతర దేశాల ఉత్పత్తులపై 15 శాతం దాకా టారిఫ్‌లను 150 రోజుల పాటు విధించే అధికారం అధ్యక్షుడికి ఉంది. దీనికి అమెరికా కాంగ్రెస్ అనుమతి అవసరం లేదు. అయితే, ఇది న్యాయ సమీక్షకు అతీతం కాదు. 15 శాతం టారిఫ్‌లను సవాలు చేస్తూ ఎవరైనా కోర్టుకు వెళ్లొచ్చు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర దేశాలపై ట్రంప్ విధించిన టారిఫ్‌లు చట్టవిరుద్ధం అంటూ అమెరికా సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. దీనిపై వెంటనే స్పందించిన ట్రంప్ విదేశాలపై 10 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. సంబంధిత కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం కూడా చేశారు. ఒక్కరోజులోనే ఆ సుంకాలను 15 శాతానికి పెంచేశారు. తనకు



150 రోజుల గడువు ఉందని, ఈలోగా చట్టబద్ధమైన, నూతన టారిఫ్‌లను విధించడానికి తమ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని ట్రంప్ వెల్లడించారు. తాము విజయవంతంగా ప్రారంభించిన 'అమెరికాను మళ్లీ గొప్పగా తీర్చిదిద్దే(మాగా)' ప్రక్రియను కొనసాగించేలా ఈ టారిఫ్‌లు ఉంటాయన్నారు.

ప్రపంచ దేశాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు చెల్లుబాటు కావని అమెరికా సుప్రీంకోర్టు తేల్చి చెప్పడం, ఇతర దేశాలపై 15 శాతం సుంకాలు తాత్కాలికంగా విధిస్తున్నట్లు ట్రంప్ వెంటనే ప్రకటించిన నేపథ్యంలో భారత్‌పై టారిఫ్‌లు ఎంతశాతం అనేది చర్చనీయాంశంగా మారింది. భారత్‌పై విధించిన 50 శాతం టారిఫ్‌లను ఇటీవలే 18 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే. భారత్, అమెరికాలు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత భారత ఉత్పత్తులపై టారిఫ్‌లు భారీగా తగ్గిపోయాయి. ప్రపంచ దేశాలపై టారిఫ్‌లను సుప్రీంకోర్టు కొట్టిపారేసిన నేపథ్యంలో ట్రంప్ ప్రకటించినట్లు భారతదేశ ఉత్పత్తులపై 15 శాతం తాత్కాలిక సుంకాలు అమల్లోకి రాబోతున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత సాంకేతికంగా చూస్తే భారత్‌పై 3.5 శాతం సుంకాలు అమల్లో ఉన్నాయి. సెక్షన్ 122 కింద ట్రంప్ విధించిన 15 శాతం తాత్కాలిక సుంకాలు కూడా కలిపితే మొత్తం సుంకాలు 18.5 శాతానికి చేరుకుంటాయి. అయితే, దీనిపై అమెరికా వైట్‌హౌస్ ఇంకా పూర్తి స్పష్టత ఇవ్వలేదు. భారత్‌పై మొత్తం సుంకాలు ఎంత అనేది అతి త్వరలో తేలిపోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

విదేశాల నుంచి అమెరికా దిగుమతి చేసుకొనే అన్ని ఉత్పత్తులపైనా 15 శాతం తాత్కాలిక సుంకాలు విధించే అవకాశం లేదు. కొన్నింటికి మినహాయింపు ఇవ్వబోతున్నారు. అరుదైన ఖనిజాలు, కరెన్సీ తయారీలో ఉపయోగించే లోహాలు, ఇంధనం, ఇంధన ఉత్పత్తులు, అమెరికాలోని లేని, తయారు చేసుకోలేని సహజ వనరులు, ఎరువులు, పశువుల మాంసం, టొమాటోలు, నారింజ పండ్లు, కొన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులు, ఫార్మా ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, ప్యాసింజర్ వాహనాలు, తేలికపాటి రవాణా వాహనాలు, బస్సులు, ప్యాసింజర్ వాహనాల విడిభాగాలపై పన్ను ఉండదు.

ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లు చెల్లుబాటు కావంటూ అక్కడి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, అనంతరం ట్రంప్ ప్రకటించిన చర్యలను నిశితంగా పరిశీలిస్తున్నామని భారత ప్రభుత్వం వెల్లడించింది. సుప్రీంకోర్టు తీర్పు, ట్రంప్ చర్యల వల్ల తలెత్తే పరిణామాలను అంచనా వేస్తున్నామని పేర్కొంది. అమెరికా కొత్తగా విధించిన టారిఫ్‌లు, వాటి ప్రభావాలపై క్షుణ్నంగా అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ శనివారం ఒక ప్రకటనలో స్పష్టంచేసింది. అన్ని అంశాలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు తెలియజేసింది. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా భారత్‌తో వాణిజ్య ఒప్పందం విషయంలో ఎలాంటి మార్పు ఉండదని ట్రంప్ శుక్రవారం మీడియా సమావేశంలో స్పష్టంచేశారు. వారు(భారత్) టారిఫ్‌లు చెల్లించాల్సిందేనని, తాము మాత్రం చెల్లించబోమని వెల్లడించారు. భారత్‌తో, భారత ప్రధాని మోదీతో అద్భుతమైన సంబంధాలు ఉన్నాయని వ్యాఖ్యానిం చారు. కోర్టు తీర్పు తమకు తీవ్ర అసంతృప్తి కలిగించిందని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మూర్ఖులు, పెంపుడు శునకాల్లాంటి వారు అంటూ నిందించారు. అమెరికాకు ఏది అవసరమో అది చేసే ధైర్యం వారికి లేదని విమర్శించారు. కోర్టు తీర్పు అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. గత ఏడాది భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం తానే ఆపేశానని మరోసారి వ్యాఖ్యానించారు. మాట వినకపోతే భారీగా టారిఫ్‌లు విధిస్తానని బెదిరించడంతో ఆ రెండు దేశాలు దారికొచ్చాయని అన్నారు. భారత్, పాక్ ఘర్షణలు 10 యుద్ధ విమానాలు నేలకూలాయని తెలిపారు. ప్రపంచ దేశాలపై టారిఫ్‌లతో ట్రంప్ ప్రభుత్వం 133 బిలియన్ డాలర్లు ఆర్జించింది. ఈ టారిఫ్‌లు చట్టప్రకారం చెల్లుబాటు కావని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఈ సొమ్ము సంగతేమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. సుప్రీంకోర్టు ఎలాంటి సమాధానం చెప్పలేదు. వసూలు చేసిన సొమ్మును ఆయా దేశాలకు వెనక్కి ఇస్తారా? అన్న దానిపై ట్రంప్ ఇంకా స్పందించలేదు. రీఫండ్ కోసం విదేశీ కంపెనీలు ఎదురుచూస్తున్నాయి. అయితే, అది అంత సులభం కాదని నిపుణులు చెబుతున్నారు. అందుకు చాలా సమయం పడుతుందని అంటున్నారు. రీఫండ్ చేయాలంటే చాలా సంస్థలు కలిసి పనిచేయాల్సి ఉంటుంది. అదొక సుదీర్ఘమైన ప్రక్రియ. చాలాకాలం వేచి చూడక తప్పదు. ఈలోగా ట్రంప్ ప్రభుత్వం గనుక చట్టంలో ఏవైనా మార్పులు చేస్తే సొమ్ము వెనక్కి వచ్చే అవకాశం ఉండదు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం



# కారులో అవసరం లేని 5 ఫీచర్స్.. ధర కూడా తగ్గుతుంది!

కార్ల ధరలు ప్రధానంగా మీరు ఎంచుకునే ఫీచర్స్ మీద ఆధారపడి ఉంటాయి. మీరు సరిగ్గా గమనిస్తే.. బేస్ వేరియంట్ ధర ఒకలా ఉంటే, టాప్ వేరియంట్ ధర ఇంకోలా ఉంటుంది. చూడటానికి కారు ఒకేలా కనిపించినా.. బేస్ వేరియంట్ - టాప్ వేరియంట్ ఫీచర్స్ వేరేలా ఉంటాయి. అంటే బేస్ వేరియంట్ లిమిటెడ్ ఫీచర్స్ పొందుతుంది. టాప్ వేరియంట్ ప్రీమియం ఫీచర్స్ లేదా అదనపు ఫీచర్స్ పొందుతుంది.

ప్రస్తుతం కారు కొనుగోలు చేసే చాలామంది ఎక్కువ ఫీచర్స్ ఉన్న కార్లనే కొంటున్నారు. ఫీచర్స్ ఉన్న కార్లను కొంటున్నారు సరే.. ఉన్న ఫీచర్స్ ఉపయోగిస్తున్నారా.. అంటే?, లేదనే చెప్పాలి. అలాంటప్పుడు ఫీచర్స్ కోసం ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టడం కూడా వృథా. కాబట్టి ఈ కథనంలో ఫాఫాపు అవసరం లేని 5 ఫీచర్స్ గురించి తెలుసుకుందాం.



### బిల్ట్ నావిగేషన్ సిస్టమ్‌లు

చాలా మంది డ్రైవర్లు గూగుల్ మ్యాప్స్ లేదా యాపిల్ మ్యాప్స్ ఉపయోగిస్తారు. అయితే వీటికంటే ఫోన్ నావిగేషన్ మరింత ఖచ్చితమైనది. అప్పటికప్పుడు అప్డేట్స్ పొందుతుంది.

### పవర్డ్ టెయిల్‌గేట్

బటన్‌తో బూట్‌ను ఓపెన్ చేయడం అద్భుతంగా అనిపిస్తుంది. కానీ ఈ ఫీచర్ చిన్న కార్లలో అంత అవసరం లేదు. ఎందుకంటే ఇది చేతితో ఓపెన్ చేయడం కంటే నెమ్మదిగా ఉంటుంది. ఇది పెద్ద కార్లకు అనుకూలంగా ఉంటుంది.

### పనోరమిక్ సన్‌రూఫ్

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న దాదాపు అన్ని కార్లలో ఈ పనోరమిక్ సన్‌రూఫ్ ఫీచర్ ఉంది. కానీ చాలామంది ఈ ఫీచర్ ఎక్కువగా ఉపయోగించరు. ఎక్కువ గాలి లేదా ఎండ వస్తుందని దాదాపు క్లోజ్ చేసి ఉంచుతారు.

### గెస్టర్ కంట్రోల్ సిస్టమ్స్

గెస్టర్ కంట్రోల్ సిస్టమ్స్ అంటే మీ చేతిని ఊపి మ్యూజిక్ మార్చడం లాంటి ఫీచర్. మొదట చూడటానికి ఇది చాలా కూల్‌గా అనిపించవచ్చు, కానీ ఎక్కువ సార్లు ఇవి సరిగ్గా పని చేయవు. కాబట్టి టచ్ కంట్రోల్ ఎంపిక చేసుకోవచ్చు. ఇది వేగంగా ఉంటుంది, నమ్మదగినదిగా ఉంటుంది.

డ్రైవింగ్ చేస్తున్నప్పుడు స్క్రీన్ ద్వారా ాజని అడ్జస్ట్ చేయడం చికాకును కలిగిస్తుంది. కాబట్టి ఫిజికల్ నాబ్‌లు సులభంగా ఉంటాయి. ప్రత్యేకించి దీనిపై శ్రద్ధ చూపాల్సిన అవసరం లేదు.ఒక కారును కొనుగోలు చేయాలనుకున్నప్పుడు అవసరమైన ఫీచర్స్ ఏవి కావాలి?, వాటిని ఎంతవరకు ఉపయోగిస్తాము అనే విషయాలను ముందుగానే ఆలోచించుకోవాలి. లేకుంటే మీకు అవసరం లేని ఫీచర్లకు కూడా ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ విషయంలో కొంత జాగ్రత్త తీసుకోవడం అవసరం.




## హైదరాబాద్‌లో తగ్గిన ఇళ్ల విక్రయాలు

సిటీబ్యూరో: హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కొత్త ఏడాది ఆశించిన స్థాయిలో ప్రారంభం కాలేదు. జనవరిలో గ్రేటర్ హైదరాబాద్‌లో రూ.2,917 కోట్ల విలువైన 4,686 యూనిట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. గత ఏడాది జనవరిలో 5,464 యూనిట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి.గతేడాది జనవరితో పోలిస్తే రిజిస్ట్రేషన్లు 14 శాతం, అలాగే ప్రాపర్టీల విలువ 16 శాతం క్షీణించాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా నెలవారి నివేదిక వెల్లడించింది. ఏడాది కాలంలో ప్రాపర్టీల ధర సగటున ఒక శాతం పెరిగింది. జనవరిలో జరిగిన రిజిస్ట్రేషన్లలో అత్యధిక వాటా మేడ్చల్--మల్కాజిగిరిలో 46 శాతంగా ఉండగా.. ఆ తర్వాత రంగారెడ్డి 34 శాతం, హైదరాబాద్‌లో 19 శాతం, సంగారెడ్డి ఒక శాతం వాటాలతో ఉన్నాయి.ఈ ఏడాది జనవరిలో రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉన్న 684 యూనిట్లు రిజిస్ట్రేషన్ కాగా.. వీటి విలువ రూ.1,294 కోట్లు. అలాగే రూ.50 లక్షల నుంచి రూ.కోటి ధర ఉన్న 991 యూనిట్లు రిజిస్ట్రేషన్ కాగా వీటి విలువ రూ.683 కోట్లుగా ఉంది. రూ.50 లక్షలలోపు ధర ఉన్న 3,011 యూనిట్లు రిజిస్ట్రేషన్ జరగగా.. వీటి విలువ రూ.929 కోట్లుగా ఉంది.

## జియో కొత్త రీఛార్జ్ ప్లాన్: 25 జీబీ డేటా..




ఎప్పటికప్పుడు కొత్త ప్లాన్స్ పరిచయం చేసే రిలయన్స్ జియో.. తాజాగా రూ. 365 ప్లాన్ తీసుకొచ్చింది. ఈ ప్లాన్ వ్యాలిడిటీ ఎంత?, డేటా, ఎస్ఎమ్ఎస్ వంటి వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.రూ. 365 ప్లాన్ రీఛార్జ్ చేసుకోవడం ద్వారా.. కస్టమర్లు 25 జీబీ డేటా పొందవచ్చు. రోజుకు 100 ఎస్ఎమ్ఎస్‌లు, అన్‌లిమిటెడ్ కాల్స్ 30 రోజుల వ్యాలిడిటీతో పొందవచ్చు. ఇవి కాకుండా.. యూజర్లు మూడు నెలల పాటు జియో హాట్‌స్టార్ మొబైల్ & టీవీ యాక్సెస్‌ను పొందవచ్చు. జియోఏఐ క్లౌడ్ కింద 50 జీబీ డేటా అందుబాటులో ఉంటుంది. కంపెనీ గూగుల్ జెమిని ప్రో ప్లాన్‌ను కూడా అందిస్తోంది. అంతే కాకుండా.. రూ. 35,100 విలువైన గూగుల్ జెమిని ప్లాన్ వినియోగదారులకు ఉచితంగా అందుబాటులో ఉంది. అయితే, దీనిని యాక్టివేట్ చేయాలి. ఈ ప్లాన్‌ను ఉపయోగించడానికి మీరు 18 ఏళ్లు పైబడి ఉండాలని గుర్తుంచుకోండి.

## ఏఐ గ్లోబల్ గవర్నెన్స్‌కు అమెరికా పూర్తి వ్యతిరేకం

కృత్రిమ మేధపై ప్రపంచవ్యాప్త నియంత్రణ లేదా 'గ్లోబల్ గవర్నెన్స్'ను అమెరికా పూర్తిగా వ్యతిరేకిస్తోందని వైట్ హౌస్ టెక్నాలజీ సలహాదారు మైఖేల్ క్రాట్సియోస్ స్పష్టం చేశారు. ఇటీవల న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో పాల్గొన్న ఆయన ఈ సాంకేతికతపై అంతర్జాతీయ బ్యూరోక్రసీల నియంత్రణను ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ అంగీకరించబోదని తేల్చి చెప్పారు. ప్రపంచ నాయకుల ఉమ్మడి ప్రకటనకు ముందు క్రాట్సియోస్ తన అభిప్రాయాలను పంచుకుంటూ.. ఏఐను కేంద్ర అధికారులు లేదా బ్యూరోక్రాట్లు నియంత్రిస్తే అది సాంకేతికత ఉజ్వల భవిష్యత్తుకు ఆటంకంగా మారుతుందని హెచ్చరించారు. 'ఏఐ గ్లోబర్ గవర్నెన్స్‌లను అమెరికా పూర్తిగా తిరస్కరిస్తోంది. భద్రత, ఊహాజనిత ప్రమాదాలపైనే దృష్టి కేంద్రీకరించడం వల్ల పోటీతత్వ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటుంది. ఇది కేవలం కొందరి చేతుల్లో అధికారాన్ని పెంచి అభివృద్ధి చెందుతున్న దేశాలను ఏఐ ఆర్థిక వ్యవస్థకు దూరం చేస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ ఏఐ నియంత్రణ కోసం ఒక అంతర్జాతీయ సంస్థ ను, నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వాతావ రణ మార్పులపై పని చేసే ఐపీసీసీ తరహాలోనే ఏఐ కోసం ఒక ప్రత్యేక ప్యానెల్‌ను రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సలహా బృందంలో మొత్తం 40 మంది సభ్యులను ధ్రువీకరించారు.






## ఆసీస్‌ను చిత్తు చేసిన భారత్.. సిరీస్ మనదే

ఆస్ట్రేలియాతో మూడో టీ20లో భారత మహిళా క్రికెట్ జట్టు విజయం సాధించింది. ఆతిథ్య జట్టును పదిహేడు పరుగుల తేడాతో ఓడించి 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది. కాగా మూడు టీ20, మూడు వన్డేలు, ఒక టెస్టు ఆడేందుకు భారత మహిళా జట్టు ఆస్ట్రేలియాకు వెళ్లింది. ఇందులో భాగంగా ఆసీస్ వుమెన్ టీమ్‌తో తొలి టీ20లో గెలుపొందిన భారత్.. రెండో టీ20లో మాత్రం ఓటమిపాలైంది.

### స్మృతి మంధాన ధనాధన్

ఈ క్రమంలో ఇరుజట్ల మధ్య శనివారం చావోరేవో తేల్చుకోవాల్సిన మూడో టీ20 జరిగింది. అడిలైడ్ వేదికగా టాస్ గెలిచిన హర్మన్ సేన.. తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లలో స్మృతి మంధాన 55 బంతుల్లో 82 పరుగులతో ఇరగదీయగా.. షఫాలి వర్మ (7) విఫలమైంది. వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ అర్ధ శతకం (59)తో సత్తా చాటగా రిచా ఘోష్ 18 పరుగులు చేసింది.కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 2 పరుగులతో అజేయంగా నిలవగా.. అమన్‌జోత్ కౌర్ (1), దీప్తి శర్మ (1) రనౌట్ అయ్యారు. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి భారత్ 176 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లలో అనాబెల్ సదర్లాండ్ రెండు వికెట్లు తీయగా.. కిమ్ గార్త్, కెప్టెన్ సోఫీ మొలినెక్స్ తలా ఒక వికెట్ దక్కించుకున్నారు.

## భారత జట్టులో తెలంగాణ అమ్మాయి



న్యూఢిల్లీ: వచ్చే నెలలో ఆస్ట్రేలియా వేదికగా జరిగే ఆసియా కప్ మహిళల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 26 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో తెలంగాణకు చెందిన సౌమ్య గుగులోత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంది.గ్రూప్ 'సి'లో ఉన్న భారత్ మార్చి 4న పెర్త్‌లో వియత్నాంతో తొలి మ్యాచ్ ఆడుతుంది. ఆ తర్వాత మార్చి 7న జపాన్‌తో, మార్చి 10న చైనీస్ తైపీతో టీమిండియా పోటీపడుతుంది. ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరుకునే నాలుగు జట్లు 2027 ప్రపంచకప్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తాయి.

### 'స్వర్ణ' సరిత

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పోలీసు క్రీడల్లో హైదరాబాద్ జిల్లాకు చెందిన బానోత్ సరిత మూడు స్వర్ణ పతకాలతో మెరిపించింది. సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో సరిత పవర్‌లిఫ్టింగ్, బాక్సింగ్, ఆర్మ్ రెజ్లింగ్ క్రీడాంశాల్లో బరిలోకి దిగి విజేతగా నిలిచింది.

## అభిషేక్ ఫామ్‌పై కాదు.. వారి గురించే నా ఆందోళన: సూర్య




ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచ నంబర్‌వన్ బ్యాటర్, ఓపెనర్ అభిషేక్ శర్మ ఇప్పటి వరకు టీ20 ప్రపంచ కప్ 2026లో పరుగుల ఖాతా తెరవలేదు. దీంతో అతడి ఫామ్‌పై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం అభిషేక్ తప్పకుండా ఫామ్ అందుకొంటాడని నమ్మకంగా చెబుతున్నాడు. సూపర్-8లో భాగంగా ఆదివారం దక్షిణాఫ్రికాతో టీమ్ఇండియా తలపడనుంది. ఈ క్రమంలో సూర్య ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. అతి కీలకమైన దశకు చేరుకున్నామని, అభిషేక్ నుంచి మంచి ఇన్నింగ్స్‌లు వస్తాయన్నాడు."అభిషేక్ ఫామ్‌పై మాకు ఎలాంటి ఆందోళన లేదు. అతడి ఫామ్ గురించి ఆందోళనపడేవారి గురించే నా ఆందోళన. ఇది టీమ్ గేమ్. ఒక్కోసారి ఎలాంటి బ్యాటర్‌కైనా ఇలాంటి పరిస్థితి ఎదురవుతూ ఉంటుంది. గత ఏడాది మొత్తం అద్భుతంగా ఆడి మమ్మల్ని కవర్ చేశాడు. ఇప్పుడు మేం అతడికి మద్దతుగా నిలుస్తున్నాం. అభిషేక్ ఒక్కసారి కుదురుకుంటే ఎంతటి భారీ ఇన్నింగ్స్‌లు ఆడతాడో మీకు తెలుసు. తనకున్న ప్రత్యేకమైన గుర్తింపుతో ఇన్నింగ్స్ స్టార్ట్ చేద్దామని చూస్తున్నాడు. అతడి ప్రయత్నం ఒక్కసారి సఫలమైతే చాలు ఆపడం చాలా కష్టం. విఫలమైతే మిగతా బ్యాటర్లందరూ పరుగులు చేస్తాం. ఇక్కడ నా ఆందోళన అంతా ప్రత్యర్థుల గురించే. ఇప్పటి వరకు పరుగుల ఖాతా తెరవలేదు. రన్స్ రాబట్టడం మొదలైతే మాత్రం వారికి కష్టాలు తప్పవు. అతడిని ఎలా ఎదుర్కోవాలనేది వారి ఆందోళన. సంజు శాంసన్ రావాలని మీరు (విలేకర్లను ఉద్దేశించి) కోరుకుంటున్నారా? అభిషేక్ లేదా తిలక్ వర్మ స్థానంలో ఆడాలని భావిస్తున్నారా? ప్రతి మ్యాచ్‌లో భారీ స్కోరు చేయాలని అనుకుంటున్నాం. అందుకు సన్నద్ధమవుతున్నాం. తుది జట్టు పైనా కసరత్తు చేస్తాం" అని సూర్య తెలిపాడు.అంతకుముందు భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ స్పందిస్తూ.. "ప్రపంచ కప్‌లో అభిషేక్ ప్రదర్శన గురించి జట్టులో ఎలాంటి చర్చ జరగలేదు. ప్రపంచస్థాయి బ్యాటర్. నంబర్ వన్ బ్యాటర్. అభిషేక్ పరుగులు చేయడంలో ఇబ్బంది పడుతున్నప్పుడు ఇతర ఆటగాళ్లు ముందుకొచ్చి బాధ్యత తీసుకుంటున్నారు. తప్పకుండా ఫామ్ అందుకొని పరుగులు చేయడం మొదలుపెడతాడు" అని వెల్లడించాడు.

## నిరాశ.. ఇదొక చేదు అనుభవం: ఆసీస్ కెప్టెన్




మాజీ చాంపియన్ ఆస్ట్రేలియాకు టీ20 ప్రపంచకప్-2026 టోర్నీలో చేదు అనుభవం ఎదురైంది. గ్రూప్ దశలోనే 'పటిష్ట' ఆసీస్ ఇంటిబాట పట్టింది. తొలుత ఐర్లాండ్‌పై గెలిచినా.. అదే జోరు కొనసాగించలే కపోయిన కంగారూలు.. జింబాబ్వే, శ్రీలంక చేతిలో ఓడిపోయారు. ఫలితంగా సూపర్-8 చేరకుండానే నిష్క్రమించిన ఆసీస్.. లీగ్ దశలో చివరగా పసికూన ఒమన్‌ను ఓడించి విజయంతో ముగించింది.ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ స్పందించాడు. ఈసారి తాము స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయామని.. భారమైన హృదయాలతో ఇంటిబాట పడుతున్నట్లు వెల్లడించాడు. "సూపర్-8 చేరే అవకాశాన్ని చేజేతులా నాశనం చేసుకున్నాం. మా డ్రెసింగ్‌రూంలో నిరాశపూరిత వాతావరణం నెలకొంది. ఇదొక చేదు అనుభవం.దురదృష్టవశాత్తూ మేము గత రెండు మ్యాచ్‌లలో ఓడిపోయాము. అత్యుత్తమ క్రికెట్ ఆడలేకపోయాము. అదే సమయంలో ప్రత్యర్థులు.. ముఖ్యంగా జింబాబ్వే అద్భుతంగా ఆడింది. ఆ జట్టు చేతిలో ఓడిపోగానే మాపై ఒత్తిడి పెరిగిపోయింది. ఈ విషయంలో వాళ్లకు క్రెడిట్ ఇవ్వాల్సిందే.ఇక్కడి పిచ్ పరిస్థితులను ఎంతమాత్రం నిందించలేము. అన్నింటికీ మేము సన్నద్ధమయ్యే ఇక్కడికి వచ్చాము. మిగతా జట్ల మాదిరే రెండేళ్లుగా మా జట్టు నిర్మాణం జరుగుతోంది. కానీ కీలక సమయంలో మేము వెనకపడ్డాము. ఈ చేదు అనుభవం నుంచి గుణపాఠం నేర్చుకుంటాము.క్రికెట్ ఆస్ట్రేలియా యాజమాన్యం ఓటమికి గల కారణాలపై విశ్లేషణ చేస్తుంది. విఫలమైనపుడు నిరాశ సహజం. అయితే, స్వదేశానికి వెళ్లిన తర్వాత అంతా కూర్చుని లోపాల గురించి చర్చించుకుంటాము. నిజాయితీగా మా తప్పులను విశ్లేషించుకుంటాము. చాలా బాధగా ఉందిఏదేమైనా చాలా బాధగా ఉంది. నిరాశా, నిస్పృహలు కమ్ముకున్నాయి. అయితే, సానుకూల దృక్పథంతో మేము ముందడుగు వేసి తిరిగి పుంజుకుంటాము" అని మిచెల్ మార్ష్ ఉద్వేగపూరిత వ్యాఖ్యలు చేశాడు.

నినాదం





## కరాటే సాధనతో ఆత్మవిశ్వాసం

**విజయవాడ పశ్చిమ, ఫిబ్రవరి 21**

పాఠశాల స్థాయి నుంచే కరాటే నేర్చుకోవటం ద్వారా బాలబాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కె.బి.ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి అన్నారు. కళాశాలలో నిర్వహించిన కరాటే పరీక్షల్లో వివిధ రకాల బెల్ట్ లు సాధించిన విద్యార్థులకు పతకాల ప్రదానోత్సవం శనివారం కళాశాలలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణవేణి మాట్లాడుతూ కరాటే సాధన చేయటం ద్వారా శారీరద దారుఢ్యంతో పాటు మానసిక స్థైర్యం కూడా కలుగుతుందన్నారు. అనుకోని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండే లక్షణం పెరుగు తుందన్నారు. కరాటే శిక్షకురాలు జి.వరలక్ష్మీదేవి మాట్లాడుతూ పాఠశాల, కళాశా ల విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ అందిస్తున్న కెబిఎన్ కళాశాల యాజ మాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 11 మందికి ఎల్లో బెల్ట్స్, 6 గురికి గ్రీన్ బెల్ట్స్, 6 గురికి పర్పుల్ బెల్ట్స్, 6 గురికి ఆరంజ్ బెల్ట్స్, 4 గురికి బ్రౌన్ బెల్ట్స్ ప్రదానం చేసారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, హిందూ హై స్కూల్స్ కమిటీ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు విద్యార్థులను అభినందించారు.

## ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

### ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి

**వికోట, ఫిబ్రవరి 21**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ బోర్డు-ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న పరీక్షలకు వీ.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాణి జూనియర్ కళాశాలలు సిద్ధమయ్యాయని ప్రభుత్వ కలశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఫిబ్రవరి 23 నుంచి జరగబోయే పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ప్రభుత్వ ప్రిన్సిపల్, కస్టోడియన్ కె బాలకృష్ణారెడ్డి తెలియజేశారు. ఈ పరీక్షలలో మొదటి సంవత్సరం సుమారు 694 మంది, రెండవ సంవత్సరం 540 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులకు కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు ఉదయం 8.30 నిమిషాల లోపు హాజరు కావలసిందిగా సూచించారు.మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలు కళాశాల ప్రాంగణంలోనికి అనుమతించబడవని అందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.కళాశాల ప్రాంగణంలో 144 సెక్షన్ విధించడమైనదని,పరీక్షల విజయవంతమైన నిర్వహణకు విద్యార్థులు, తల్లితండ్రులు, ప్రజలు సహకరించవలసినదిగా ఆయన కోరారు.

## వికోట సిహెచ్సీ ఆకస్మిక తనిఖీ



**వికోట, ఫిబ్రవరి 21**

చిత్తూరు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిణీ డాక్టర్ పద్మాంజలి దేవి వీకోట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. విడి విడిగా అన్ని విభాగాలలో రోగుల యొక్క అభిప్రాయాలను, వారికి రోజువారీ అందించేటువంటి వైద్య సదుపాయాలు గురించి కూపీ లాగారు. పోస్టుమార్టం గది నిర్మాణ దశను పరిశీలించారు. ఓపి సమయం తర్వాత డాక్టర్లు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వశీ నిర్దేశించిన ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వహించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వఛ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.ల్యాబ్ , రక్త నిల్వ కేంద్రం, డెలివరీ వార్డు, ఓపిడి, ఐపిడి వార్డులను సందర్శించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.అందరూ సమయపాలన తప్పక పాటించాలని సూచించారు.ఈ యొక్క కార్యక్రమానికి హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ ధీరజ్,వైద్యాధికారి డా.మురళి,డా.కిరణ్, డా.సల్మా, డా.అశ్విని, హెడ్ నర్స్ కృష్ణ కుమారి, ల్యాబ్ ఇన్చార్జి లీలావతి ,రక్త నిల్వ కేంద్రం ఇంచార్జ్ సుబ్రహ్మణ్యం ఫార్మసీ ఇన్చార్జ్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా "స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర" ప్రారంభం..

### స్వచ్ఛరథాన్ని సద్వినియోగం చేసుకోండి:ఏ ఎం రంగనాథ్




**వికోట, ఫిబ్రవరి 21**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన స్వచ్ఛరథ వాహనాన్ని ప్రజలందరరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్ తెలిపారు.శనివారం స్థానిక వీకోట మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో పలమనేర్ శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి ఆదేశాల మేరకు రంగనాథ్ ఆధ్వర్యంలో స్వచ్ఛరథంను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రజారోగ్యం పరిశుభ్రతే లక్ష్యంగా చెత్త రహిత పట్టణంగా మార్చే లక్ష్యంతో ఈ స్వచ్ఛరథాన్ని ప్రారంబిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రాంబాబు, స్థానిక సర్పంచ్ పిఎన్ లక్ష్మీ ,ఉప సర్పంచ్ అక్మల్ ,రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ గజేంద్ర, కార్యదర్శి ఈశ్వర్ గౌడ్, హాస్పిటల్ డెవలప్మెంట్ డైరెక్టర్ ధీరజ్, శబరిష్, డిప్యూటీ ఎంపీడీవో భాస్కర్, ఈవో నరేష్, పంచాయతీ సిబ్బంది సాదిక్ భాషా, అఖిలపక్ష బిజేవైఎం రాష్ట్ర నాయకులు శివ, వైకాపా వార్డు మెంబర్ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలకు దిక్సూచిగా నిలిచిన విజేత

● పట్టుదల + క్రమశిక్షణ: డాక్టర్ యామిని విశ్వనాథపల్లి






**విజయవాడ, ఫిబ్రవరి 21** (పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన డాక్టర్యామిని విశ్వనాథపల్లి రుజువు చేసింది. తండ్రి ఓ లారీడ్రైవర్ అయిన తనను కష్టపడి చదివిస్తుంటే ఆ తండ్రే గర్వపడేలా తను వారికి పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టింది. విజయవాడ, గుణదలకు చెందిన తండ్రి వి.పి.ఎస్.ఎన్.మూర్తి, తల్లి కనకదుర్గ వారి కుమార్తెకు చిన్ననాటి నుండి డాక్టరు అవ్వాలని కోరికతో ఉండేది,తన కోరిక ఎంత ధృడంగా ఉందంటే తన చిన్ననాటి నుంచే పట్టుదలతో చదువుకుంది. ఉన్నత పాఠశాల సెయింట్ జోసెఫ్స (ఇంగ్లీష్ మీడియం స్కూల్) నుండి పట్టుదలతో చదివి 9.7% మార్కులు ఉత్తీర్ణురాలైంది.నీట్ పరీక్షలలో బోటని లెక్చరర్ అబ్దుల్ సుబాని (లేటు) ప్రోత్సాహంలో మంచి ఉత్తీర్ణత సాంధించింది. పట్టుదల క్రమశిక్షలతో కోనసీమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (కిమ్స్), అమలాపురంలో డాక్టరేట్ పూర్తి చేసి, డీన్ డాక్టర్ ఆనందాచారి, డాక్టర్ వరదా చేతుల మీదుగా డాక్టర్ పట్టాను అందుకుని తల్లిదండ్రులు, తన కుటుంబ సభ్యులను గర్వింపజేసేలాగా అందరికి ఆదర్శంగా నిలిచింది. ఆమె డాక్టర్ పొందిన తన ప్రస్థానం పేద, మధ్య తరగతి ఆడపిల్లలందరికి దిక్సూచి అని తన ఉపాధ్యాయులు చెబుతున్నారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే డాక్టర్ యామిని విశ్వనాథపల్లి ప్రతి ఒక్కరూ తమ అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని చెప్పారు.

### ముఖ్యమంత్రి సహాయనిధి తోడ్పాటుతో

# మణిపాల్ హాస్పిటల్స్‌లో తొలి గుండె మార్పిడి విజయవంతం







**అమరావతి, ఫిబ్రవరి 21** ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక వైద్య సేవలకు మరోమైలురాయిగా మణిపాల్ హాస్పిటల్స్ విజయవాడలోతొలి గుండె మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. ముఖ్యమంత్రి సహాయనిధి మరియు మణిపాల్ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఈ ప్రాణరక్షకశస్త్రచికిత్స నిర్వహించినటు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. విజయనగరం జిల్లాకు చెందిన 21 ఏళ్లయువతి కుమారి కె. సత్యవతి గత ఐదేళ్లుగా డైలేటెడ్కార్డియోమయోపతి వ్యాధితో బాధపడుతూ, తీవ్రమైనహార్ట్ ఫెయిల్యూర్ దశకు చేరుకున్నారు. సమగ్ర వైద్యపరీక్షలు, రైట్ హార్ట్ క్యాథెటరైజేషన్ తదితర ట్రాన్స్‌ప్లాంట్ ఇవాల్యువేషన్ అనంతరం ఆమెను రాష్ట్ర అవయవ మార్పిడి నెట్‌వర్క్ జీవనదాన్ కింద ట్రాన్స్‌ప్లాంట్ జాబితాలో చేర్చారు. అనంతరం సరిపోయే దాత గుండె అందుబాటులోకి రావడంతో శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉండి, వైద్యుల పర్యవేక్షణలో సానుకూలంగా కోలుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ట్రాన్స్‌ప్లాంట్ బృందం సభ్యులు మాట్లాడుతూ గుండె మార్పిడి వంటి క్లిష్ట శస్త్రచికిత్సలకు ఎక్మో, వెంట్రిక్యులర్ అసిస్ట్ డివైసెస్ వంటి అత్యాధునిక సదుపాయాలు, విభిన్న వైద్య విభాగాల సమన్వయం అత్యవసరమని వివరించారు. కుమారి సత్యవతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి మరియు మణిపాల్ ఫౌండేషన్ అందించిన ఆర్థిక సహాయం తమ కుటుంబానికి గొప్ప ఊరటనిచ్చిందని, కొత్త గుండెతో కొత్త జీవితాన్ని అందించారని భావోద్వేగంగా తెలిపారు. ఆసుపత్రి డైరెక్టర్ జె. రామాంజనేయ రెడ్డి మాట్లాడుతూ, ఈ విజయం అమరావతి ప్రాంతంలో అడ్వాన్స్‌డ్ కార్డియాక్ కేర్ విస్తరణలో కీలక ముందడుగని, రాష్ట్ర ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. అవయవ దానం ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేస్తూ, మరింత మంది దాతలు ముందుకు రావాలని వైద్య నిపుణులు విజ్ఞప్తి చేశారు.

## స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా పురస్కారం

### 2026కు తానంకి చార్లెస్ ఎంపిక

**మైలవరం, ఫిబ్రవరి 21**



ఉయ్యాలవాడ నరసింహ రెడ్డి పేరుతో ప్రదానం చేయనున్న "స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా పురస్కారం--2026"కు సామాజిక సేవకుడు, విజయశక్తి విద్యలయంలో పిఈటి మాస్టర్ గా పని చేస్తున్న కుటముక్కల గ్రామం నివాసి తానంకి చార్లెస్ ఎంపికైనట్లు శ్రీ వాజ్పేయి, అద్వాని సేవా ట్రస్ట్ చైర్మన్ పలుకుల వీరారెడ్డి ప్రకటించారు. విద్యారంగంలో మరియు సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేసినందుకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఆయనను ఎంపిక చేసినట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. తానంకి చార్లెస్ సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఆయన కృషి యువతకు స్ఫూర్తిదాయకమని వారు కొనియాడారు.ఈ సేవా పురస్కారం ప్రధాన కార్యక్రమం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా 2026 ఫిబ్రవరి 22న ఘనంగా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వెల్లడించింది. ఈ అవార్డుకు ఎంపిక చేసినందుకు తానంకి చార్లెస్ ట్రస్ట్ సభ్యులకు మరియు ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ బి.ఎస్. నారాయణరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.



## సహకార సంఘం ఉద్యోగుల నిరసన దీక్ష

**మైలవరం, ఫిబ్రవరి 21**

స్థానిక కేడీసీసీ బ్యాంకు వద్ద నియోజకవర్గ పరిధిలో 24 సహకార సంఘాల ఉద్యోగులు తమ దీర్ఘ కాళిక సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వీరి యొక్క ప్రధాన డిమాండ్లైన జీవో నెంబర్ 36 అమలు, 2019 తరువాత జాయిన్ ఐన ఉద్యోగులను పేర్మినెంట్ చేయాలని, డ్యూటూ పద్దులను రద్దు చేయాలని, గ్రాట్యుటీ చట్ట ప్రకారం అమలు చేయాలని,2014' 2019 వేతన సవరణ చట్టం అమలు చేయాలని, ఆరోగ్య భీమా మరియు టర్మ్ ఇన్సూరెన్సు అమలు చేయాలని తమ డిమాండ్స్ అమలు చేసే వరకు సంఘాలలో సేవలు నిలిపి వేస్తామనని తెలియజేశారు.

# బుద్ధవరంలో ఘనంగా అభయ ఆంజనేయ స్వామి తృతీయ వార్షికోత్సవం

### పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే యార్లగడ్డ

**గన్నవరం, ఫిబ్రవరి 21**

గన్నవరం మండలం బుద్ధవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రముఖ అర్చకులు గుదిమెళ్ల దిలీప్ కుమార్ ఆచార్యుల పర్యవేక్షణలో తెల్లవారు జాము నుండే స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి పంచామృత అభిషేకం, నవరసాభిషేకం, సింధూరాభిషేకంతో పాటు వివిధ రకాల పుష్పాలతో పుష్పాభిషేకం నేత్రపర్వంగా నిర్వహిం చారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి హోమం, లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం, ఆంజనేయ హోమం మరి యు శాంతి హోమాలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఈ వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన హోమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. ఈ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు మరియు అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన యాగశాలలో జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గన్నవరం పరిసర ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



# ఆస్ట్రేలియాను చిత్తు చేసిన భారత్

## స్పోర్ట్స్

**2-1తో ద్వైపాక్షిక సిరీస్ కైవసం !**

**సమిష్టిగారాణించిన టీమిండియా మహిళలు**



ఆస్ట్రేలియా గడ్డపై భారత మహిళల క్రికెట్ జట్టు అద్భుతం సృష్టించింది. అడిలైడ్ ఓవల్ వేదికగా శనివారం జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాపై 17 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుని దశాబ్దాల చరిత్ర తిరగరాసింది. దాదాపు పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియాలో ద్వైపాక్షిక సిరీస్ గెలవడం విశేషం. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 176 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా జట్టును మన బౌలర్లు తీవ్రంగా ఒత్తిడికి గురిచేశారు. కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి ఆసీస్ జట్టు 20 ఓవర్లు ముగిసేసరికి తొమ్మిది వికెట్లు కోల్పోయి కేవలం 159 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు సమిష్టి కృషితో సాధించిన ఈ అద్భుతమైన విజయం పట్ల దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచింది. భారత బ్యాటింగ్ ఇన్నింగ్స్‌లో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, యువ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వీరవిహారం చేశారు. ఆరంభంలోనే షఫాలీ వర్మ వికెట్ కోల్పోయిన దశలో ఈ ఇద్దరూ కలిసి ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. స్మృతి మంధాన కేవలం 55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో చెలరేగి 82 పరుగులు సాధించి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించింది. మరోవైపు జెమీమా రోడ్రిగ్స్ కూడా ఎంతో ధాటిగా ఆడుతూ 46 బంతుల్లో 59 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు అత్యంత కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో భారత్ భారీ స్కోరు దిశగా పయనించింది. ఆఖర్లో వరుస వికెట్లు పడినప్పటికీ, వీరిద్దరి మెరుపు ఇన్నింగ్స్‌లే టీమిండియా చారిత్రక విజయానికి బలమైన పునాది వేశాయి. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు భారత బౌలర్లు ఆరంభంలోనే కోలుకోలేని షాక్ ఇచ్చారు. యువ స్పిన్నర్లు శ్రేయాంక పాటిల్, శ్రీ చరణి తమ స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. పవర్ ప్లే లోనే ఆస్ట్రేలియా టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చి మ్యాచ్‌ను మన ఆధీనంలోకి తెచ్చారు. ఆస్ట్రేలియా బ్యాటర్లలో ఆష్లీ గార్డ్‌నర్ (57 పరుగులు) మాత్రమే ఒంటరి పోరాటం చేసింది. మిగతా ఎవరూ పెద్దగా రాణించకపోవడంతో ఆసీస్ పరాజయం పాలైంది. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్ 3 వికెట్లు పడగొట్టగా, శ్రీ చరణి కూడా 3 వికెట్లు తీసుకుని సత్తా చాటింది. పేసర్ అరుంధతి రెడ్డి 2 వికెట్లు తీసి తన వంతు సహకారం అందించింది. వన్డే సిరీస్, టెస్ట్ మ్యాచ్‌కు ముందు ఆస్ట్రేలియా లాంటి బలమైన జట్టును వాళ్ల సొంతగడ్డపై మట్టికరిపించడం భారత జట్టు ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచుతుంది.



## ఇషానీ జోహార్‌తో విడాకులు తీసుకున్న రాహుల్ చాహర్

భారత క్రికెటర్ రాహుల్ చాహర్, తన భార్య ఇషానీ జోహార్‌తో విడాకులు తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు. సుదీర్ఘ కాలం పాటు కొనసాగిన వీరి వివాహ బంధం ముగియడంపై రాహుల్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్ చేశారు. గత కొద్ది కాలంగా వ్యక్తిగత జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారత స్పిన్నర్ రాహుల్ చాహర్, తన వైవాహిక బంధానికి ముగింపు పలికారు. ఫ్యాషన్ డిజైనర్ అయిన ఇషానీ జోహార్‌తో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. రాహుల్ తన విడాకుల నిర్ణయం గురించి ఓ సందేశాన్ని పంచుకున్నారు. “నేను చాలా చిన్న వయసులోనే పెళ్లి చేసుకున్నాను. అప్పట్లో నన్ను నేను, నా విలువలను, జీవితం వైపు నా దిశను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను” అని రాహుల్ పేర్కొన్నారు. గత 15 నెలలుగా కోర్టు ప్రక్రియల ద్వారా వెళ్తున్న సమయంలో సహనం, నిజాయితీ ప్రాముఖ్యతను తెలుసుకున్నట్లు ఆయన వివరించారు. “నేను ఈ బంధాన్ని కోపంతోనో, విచారంతోనో ముగించడం లేదు. పూర్తి స్పష్టతతో ముందుకు సాగుతున్నాను. కొన్ని సంబంధాలు కేవలం మనకు జీవిత పాఠాలు నేర్పడానికే వస్తాయి” అని రాహుల్ రాసుకొచ్చారు. ఈ విడాకులను ఒక ముగింపుగా కాకుండా కొత్త ప్రారంభంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆత్మగౌరవం, ప్రశాంతత, భవిష్యత్తుపై స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగుతానని, తన మనసులో ఎలాంటి చేదు అనుభవాలను ఉంచుకోవాలని అనుకోవడం లేదని స్పష్టం చేశారు. రాహుల్ - ఇషానీ బంధం నేపథ్యం.. 2019లో జైపూర్ వేదికగా రాహుల్, ఇషానీ నిశ్చితార్థం జరిగింది. ఆ తర్వాత 2022లో వీరిద్దరూ ఒక్కటయ్యారు. సుమారు నాలుగు ఏళ్ల సహజీవనం (నిశ్చితార్థం నుండి) తర్వాత వీరు విడిపోవాలని నిర్ణయించుకున్నారు. మార్చి 9న వీరి వివాహ వార్షికోత్సవం జరుపుకోవాల్సి ఉండగా, అంతకంటే ముందే చట్టపరంగా విడిపోయారు.





## అసలైన అసలైన సమరానికి తెర

### నేడు భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య సూపర్-8 పోరు

### అభిషేక్ శర్మ స్థానంలో జట్టులోకి సంజూ శాంసన్!

టీ20 వరల్డ్ కప్ 2026లో అసలైన అసలైన సమరానికి తెరలేచింది. ఆదివారం (ఫిబ్రవరి 22) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్, సౌతాఫ్రికా జట్లు సూపర్-8 పోరులో తలపడనున్నాయి. గత టీ20 వరల్డ్ కప్ ఫైనలిస్టుల మధ్య జరుగుతున్న ఈ మ్యాచ్ అంటే అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే, ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా తుది జట్టు (ప్లేయింగ్-11) విషయంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఓపెనర్ అభిషేక్ శర్మ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో సున్నాకే అవుట్ కావడంతో, అతని స్థానంలో సంజూ శాంసన్‌ను తీసుకుంటారా అన్న సందేహాలు మొదలయ్యాయి. శుక్రవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో సంజూ శాంసన్ నెట్స్‌లో చాలా సేపు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడంతో, అతను తుది జట్టులోకి వస్తున్నాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. సాధారణంగా మ్యాచ్‌కు ముందు ఎవరైతే ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తారో, వారు ప్లేయింగ్-11లో ఉండే అవకాశం ఉంటుంది. ఇదే విషయాన్ని ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముందు ఉంచగా, ఆయన చాలా ఆసక్తికరంగా స్పందించారు. “ఏంటి.. సంజూను ఆడించడం కోసం అభిషేక్ శర్మను తప్పించమంటారా? లేక నంబర్-3లో ఆడుతున్న తిలక్ వర్మను పక్కన పెట్టమంటారా?” అంటూ ఎదురు ప్రశ్న వేశారు. దీన్ని బట్టి చూస్తుంటే, టీమ్ మేనేజ్మెంట్ అభిషేక్ శర్మపైనే పూర్తి నమ్మకంతో ఉన్నట్లు అర్థమవుతోంది. జట్టు ప్రదర్శనపై వస్తున్న విమర్శలను కూడా సూర్య సున్నితంగా తిప్పికొట్టారు. “ప్రస్తుతం అంతా బాగానే ఉంది. పవర్‌ప్లేలో 40-50 పరుగులు వస్తున్నాయి. మనం ద్వైపాక్షిక సిరీస్‌లలో భారీ స్కోర్లు సాధించడంతో అందరిలో అంచనాలు పెరిగిపోయాయి. ప్రతి మ్యాచ్‌లోనూ 220-240 పరుగులు చేయాలని ఆశించడం సహజమే. కానీ ఇక్కడి వికెట్లు కొంచెం భిన్నంగా ఉన్నాయి. గ్రూప్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ పరిస్థితులు వేరుగా ఉన్నాయి, వాటికి తగ్గట్టే మేము ఆడుతున్నాం అని సూర్య చెప్పుకొచ్చారు. ఓపెనింగ్ జోడీలో అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ కొనసాగే అవకాశం ఉంది. మిడిల్ ఆర్డర్‌లో తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, శివమ్ దూబే బలాన్ని ఇస్తారు. బౌలింగ్ విభాగంలో వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ మధ్య పోటీ ఉన్నప్పటికీ.. వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌కే మొగ్గు ఎక్కువగా ఉంది. నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకున్న అక్షర్, ఇప్పుడు కీలకమైన సౌతాఫ్రికా మ్యాచ్‌లోకి నేరుగా వచ్చే అవకాశం ఉంది. వరుణ్ చక్రవర్తి స్పిన్ అమ్ములపొదిలో కీలక అస్త్రంగా మారగా, బుమ్రా-అర్ష్‌దీప్ పేస్ భారాన్ని మోయనున్నారు.

## అభిషేక్ శర్మ గురించి టెన్షన్ లేదు

### టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్

టీమిండియా మ్యాచ్ అంటే చాలు స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ డకౌట్ల గురించే చర్చ జరుగుతోంది. అయితే మేనేజ్‌మెంట్ నుంచి అభిషేక్ శర్మకు కావాల్సినంత సపోర్ట్ లభిస్తోంది. అభిషేక్ శర్మ డకౌట్లపై టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ సరదాగా స్పందించాడు. తాను ఆందోళన చెందుతున్నది అభిషేక్ శర్మ ఫామ్ గురించి కాదని, ప్రత్యర్థి జట్ల గురించి ఆందోళన చెందుతున్నానని తనదైనశైలిలో బదులిచ్చాడు. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8లో టీమిండియా మొదటి మ్యాచ్ దక్షిణాఫ్రికాతో నేడు తలపడనుంది. మ్యాచ్‌కు ముందు రోజు శనివారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీ20ల్లో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను అభిషేక్ శర్మ పేలవ ఫామ్ గురించి ప్రశ్నలు అడిగారు. అభిషేక్ గ్రూప్ స్టేజ్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ డకౌట్ అయ్యాడు. అయితే ఓపెనర్ బ్యాటర్ గురించి ఎలాంటి ఆందోళన లేదని, కానీ ప్రత్యర్థి జట్ల గురించి తనకు ఆందోళనగా ఉందని కెప్టెన్ సూర్య పేర్కొన్నాడు. ‘అభిషేక్ శర్మ ఫామ్ గురించి ఆందోళన చెందుతున్న వారిని చూసి నేను ఆందోళన చెందుతున్నాను. అభిషేక్ శర్మ భవిష్యత్తులో ఎవరితో ఆడబోతున్నాడో ఆ జట్ల గురించి ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో అతనిని ఎదుర్కోబోయే జట్ల గురించి ఎక్కువ ఆందోళనగా ఉన్నారు. గత సంవత్సరం అభిషేక్ చాలా చేశాడు. ఇప్పుడు అతనికి మేం సహకరించాల్సిన సమయం వచ్చింది’ అని సూర్య మద్దతుగా నిలిచాడు. ప్రతి మ్యాచులో 250 పరుగులు చేయాల్సిన అవసరం లేదని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. వికెట్లు కొంచెం భిన్నంగా ఉన్నాయని ఆయన చెప్పారు. తదుపరి మ్యాచ్‌లలో వచ్చే పిచ్ సవాళ్లను తాము ఎదుర్కొంటామని తెలిపారు. భారత్ నెదర్లాండ్స్‌పై ఇక్కడి నరేంద్ర మోదీ స్టేడియంలోనే విజయం సాధించింది, ఇప్పుడు దక్షిణాఫ్రికాతో సూపర్-8 మ్యాచ్ కూడా అక్కడే జరగనుంది. ప్రస్తుత ఎడిషన్‌లో దక్షిణాఫ్రికా కూడా ఈ గ్రౌండ్‌లో 2 మ్యాచ్‌లు ఆడి రెండింటిలోనూ విజయం సాధించింది. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8లో భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం జరగనుంది. నెదర్లాండ్స్ మ్యాచులో అభిషేక్ వరుసగా మూడవసారి డకౌట్ అయ్యాడు. అంతకుముందు పాకిస్తాన్, అమెరికాలపై కూడా ఖాతా తెరవలేదు. ఇప్పటివరకు టోర్నీలో ఓడిపోనప్పటికీ, ఇకనుంచి అభిషేక్ పరుగులు చేయడం జట్టుకు అవసరం. కానీ తన ఆటగాడికి కెప్టెన్ నుంచి సపోర్ట్ లభించింది.

దక్షిణాఫ్రికాపై భారత్ ప్లేయింగ్ 11 అంచనా

అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా.



## ఒత్తిడిలో ఉన్న భారత్‌ను ఓడిస్తాం

సౌతాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి కాన్రాడ్ ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా.. అసలు సిసలు పోరుకు సిద్దమైంది. సూపర్-8లో భాగంగా ఆదివారం సౌతాఫ్రికాతో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా రాత్రి 7.30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే ఈ మ్యాచ్ నేపథ్యంలో తమ కంటే భారత్‌పైనే ఒత్తిడి ఎక్కువగా ఉందని సౌతాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి కాన్రాడ్ అన్నాడు. ఈ మ్యాచ్ నేపథ్యంలో శనివారం మీడియాతో మాట్లాడిన షుక్రి కాన్రాడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్ మీదే ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని చెప్పాడు. ఒత్తిడిలో ఏ జట్టు అయినా బలహీనపడుతుందని, దాన్ని క్యాష్ చేసుకొని విజయం సాధిస్తామని పేర్కొన్నాడు.’భారత్ మీదే ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. సెమీఫైనల్స్ చేరుకునే విషయంలో టీమిండియాపైనే అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. వారు ఫైనల్‌కు కూడా చేరుకుంటారు. అయితే ఒత్తిడిలో వారు బలహీనపడుతారు. దాన్ని క్యాష్ చేసుకుంటాం. నిజానికి మా ఇరు జట్ల మీదా ఒత్తిడి ఉంటుంది.మేమంతా అత్యుత్తమ జట్టుతో మ్యాచ్ ఆడితే ఉండే ఒత్తిడి గురించి మాట్లాడుతున్నాం. నిజానికి వారు ఏ ఒత్తిడిలో ఉన్నారో తెలియదు. అభిషేక్ శర్మ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో వరుసగా డకౌట్ అయిన వ్యక్తి, జట్టులో తన స్థానం గురించి పడే ఒత్తిడి గురించి నేను మాట్లాడటం లేదు.’అని షుక్రి కాన్రాడ్ పేర్కొన్నాడు. మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ అయినా అభిషేక్ శర్మకు టీమిండియా మేనేజ్‌మెంట్ అండగా నిలుస్తోంది. అతను వరల్డ్ నెంబర్ వన్ బ్యాటర్ అని, కీలక సమయంలో తప్పకుండా ఫామ్ అందుకుంటాడని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. గతేడాది చివర్లో సౌతాఫ్రికా జట్టు భారత్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా ఐదు టీ20ల సిరీస్‌ను టీమిండియా 3-1తో గెలిచింది. ఈ సిరీస్‌లో ఒక మ్యాచ్ వర్షం కారణంగా తుడిచి పెట్టుకుపోయింది. అయితే ద్వైపాక్షిక సిరీస్ ఫలితాలు ప్రపంచకప్ పోరుకు ఏ మాత్రం ప్రామాణికం కావని షుక్రి అన్నాడు. ఈ క్రమంలోనే భారత్, సౌతాఫ్రికా మధ్య జరిగే సూపర్-8 పోరు హోరా హోరీగా ఉంటుందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేశవ్ మహారాజ్, జార్జ్ లిండేతో సౌతాఫ్రికా స్పిన్ విభాగం, క్వింటన్ డికాక్, ర్యాన్ రికెల్టన్, ఐడెన్ మార్క్‌రమ్, ట్రిస్టన్ స్టబ్స్ బ్యాటింగ్ దళం బలంగానే కనిపిస్తోంది.



# విశ్వజ



## అండర్ ఆర్మ్స్ క్లీన్‌గా ఉండాలంటే ఇలా చేయండి..!

చంకలు పరిశుభ్రంగా, తాజాగా ఉండటం మన వ్యక్తిగత పరిశుభ్రతలో చాలా ముఖ్యం. ఇది కేవలం మంచి వాసన కోసమే కాదు, ఆరోగ్యానికీ అవసరం. అండర్ ఆర్మ్స్ క్లీన్‌గా, వాసన రాకుండా ఉండటానికి కొన్ని సులభమైన, ఆచరణీయమైన చిట్కాలు ఇక్కడ ఉన్నాయి.ప్రతిరోజూ స్నానం చేసేటప్పుడు, యాంటీబ్యాక్టీరియల్ సబ్బు లేదా బాడీ వాష్‌తో చంకలను బాగా శుభ్రం చేసుకోండి. వాసన రావడానికి కారణం బ్యాక్టీరియా వృద్ధి చెందడమే, కాబట్టి వాటిని తొలగించడం ముఖ్యం. బాగా రుద్ది కడగడం వల్ల పేరుకుపోయిన చెమట, మృతకణాలు, బ్యాక్టీరియా తొలగిపోతాయి. చంకలలో వెంట్రుకలు ఉండటం వల్ల చెమట, బ్యాక్టీరియా పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. రెగ్యులర్‌గా షేవింగ్ చేసుకోవడం లేదా హెయిర్ రిమూవల్ క్రీమ్ వాడటం వల్ల చంకలు పొడిగా, శుభ్రంగా ఉంటాయి. ఇది దుర్వాసనను తగ్గిస్తుంది. " కాంగ్రెస్ గూటికి కవిత – హైకమాండ్ చర్చలు, తేల్చి చెప్పిన రేవంత్..!?" ఇది చెమటను తగ్గించడంలో సహాయపడుతుంది. మీ చర్మతత్వానికి సరిపడే మంచి యాంటీపెర్స్పిరెంట్‌ను ఎంచుకోండి. ఇది రాత్రిపూట లేదా స్నానం చేసిన వెంటనే పొడి చంకలపై రాస్తే మంచి ఫలితాలు ఉంటాయి.ఇది చెమట వాసనను అరికడుతుంది కానీ చెమటను తగ్గించదు. మీకు తక్కువ చెమట పడితే, మంచి సువాసన గల డియోడరెంట్ సరిపోతుంది.రోజుకు రెండుసార్లు, ఉదయం మరియు అవసరమైతే సాయంత్రం, డియోడరెంట్ లేదా యాంటీపెర్స్పిరెంట్ వాడండి. స్నానం చేసిన తర్వాత లేదా చంకలు తడిగా ఉన్నప్పుడు, వాటిని పూర్తిగా పొడిగా తుడవండి. తేమ బ్యాక్టీరియా వృద్ధికి అనుకూల వాతావరణం. కాటన్ టవల్‌తో మెల్లగా అద్దండి. కాటన్, నూలు వంటి సహజ వస్త్రాలు ధరించండి. ఇవి గాలిని బాగా ప్రసరింపజేసి, చెమటను పీల్చుకుంటాయి. సింథటిక్ దుస్తులు (నైలాన్, పాలిస్టర్) చెమటను పట్టేసి, వాసనను పెంచుతాయి. వదులుగా ఉండే దుస్తులు ధరించడం వల్ల కూడా గాలి తగిలి చంకలు పొడిగా ఉంటాయి.కొన్ని రకాల ఆహార పదార్థాలు, ముఖ్యంగా వెల్లుల్లి, ఉల్లిపాయలు, కారంగా ఉండే ఆహారాలు, మరియు అధికంగా కెఫిన్ ఉండే పానీయాలు శరీర దుర్వాసనను పెంచుతాయి. వీటిని తగ్గించడం వల్ల కొంతవరకు ఫలితం ఉంటుంది. తగినంత నీరు తాగడం వల్ల శరీరం డిటాక్స్ అయి, దుర్వాసన తగ్గుతుంది. 5 5 00:00 / 01:59 సహజమైన మార్గాలను ఇష్టపడేవారు నిమ్మరసం లేదా పలుచటి ఆపిల్ సైడర్ వెనిగర్‌ను దూదితో చంకలపై అద్దవచ్చు. ఇవి బ్యాక్టీరియాను చంపడంలో సహాయపడతాయి. అయితే, షేవింగ్ చేసుకున్న వెంటనే వీటిని వాడకూడదు, చికాకు కలగవచ్చు.ఈ చిట్కాలు పాటించడం ద్వారా మీరు రోజంతా తాజాగా, ఆత్మవిశ్వాసంతో ఉండగలరు! ఏమైనా తీవ్రమైన వాసన సమస్యలుంటే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

## జిమ్ అవసరం లేదు, కఠినమైన డైట్ వద్దు..
# దీంతో షాకయ్యేలా వెయిట్ లాస్!



ఊబకాయం.. ప్రస్తుతం సమాజంలో ఇది అతి పెద్ద సమస్య. ఊబకాయంతో బాధపడుతూ బరువు తగ్గడం కోసం చాలామంది రకరకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. బరువు తగ్గడం లేదని తెగ బాధ పడుతూ ఉంటారు. బరువు తగ్గడం కోసం జిమ్ లకు వెళుతూ ఉంటారు. కఠినమైన డైట్ లను చేస్తూ ఉంటారు. కానీ ఎటువంటి ఫలితము రాదు. ఇంట్లోని పదార్థాలతోనే మంచి ఆయుర్వేదిక్ మెడిసిన్ అయితే బరువు తగ్గాలని భావించే వారికి చాలా తక్కువ ఖర్చుతో, ఇంట్లోనే ఉండే పదార్థాలతో, బరువును తగ్గించుకోవడానికి ఒక మంచి ఆయుర్వేదిక్ మెడిసిన్ మనమే తయారు చేసుకోవచ్చని చెబుతున్నారు.నేచురల్ పద్ధతిలో మనం మన బరువు తగ్గడానికి ఉదయం లేవగానే పరగడుపున, మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత, రాత్రి పడుకునే ముందు ఒక డిటాక్స్ డ్రింక్ ని తాగితే మంచిదని సలహా ఇస్తున్నారు. మరి అదేమిటో ప్రస్తుతం చూద్దాం. ఈ పొడితో అద్భుతం 100గ్రాముల జీలకర్రను, 100గ్రాముల వాము, 100గ్రాముల మెంతులు, మూడు సమపాళ్లల్లో తీసుకుని లైట్ గా వేయించి, అందులో 25గ్రాముల యాలుకలు, 100గ్రాముల సోంపును కలిపి మిక్సీలో వేసి మెత్తని పొడిగా చేసి దానిని ఎయిర్ టైట్ బాటిల్లో పెట్టుకొని, ప్రతిరోజు ఉదయం పరగడుపున నీళ్లలో వేసి మరిగించి తాగితే, అలాగే మధ్యాహ్నం భోజనం తర్వాత, రాత్రి పడుకునే ముందు దీనిని తీసుకుంటే బరువు తగ్గే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. దీంతో బరువుకు చెక్, షుగర్ నియంత్రణ ఈ పానీయం కడుపు ఉబ్బరాన్ని తగ్గించడమే కాకుండా జీర్ణ ప్రక్రియను అద్భుతంగా మెరుగుపరుస్తుందని, ఇది శరీరంలో మలినాలను బయటకు పంపడానికి ఎంతో బాగా దోహదం చేస్తుందని చెబుతు న్నారు. ఇది మన శరీరంలో మెటబాలిక్ రేట్ ను పెంచుతుందని, దీంతో చాలా ప్రభావవంతంగా శరీరంలోని ఫ్యాట్ బర్న్ అవుతుందని చెబుతున్నారు. ఇది బ్లడ్ షుగర్ లెవల్స్ ను తగ్గిస్తుందని, బరువు తగ్గడానికి ఎంతగానో సహకరిస్తుందని చెబుతున్నారు. %ూశీషవతీవస దీఎ^ూశ్రీంశీ =ఘుస% కాళ్ళలో నీరు.. నొక్కితే సొట్టలు పడితే ఆందోళనకరమా? ఈ పొడితో ఆరోగ్యం, నొప్పులు మాయం ప్రతిరోజు ఈ పొడిని తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ తొలగిపోతాయి. కీళ్ల నొప్పులు, మోకాళ్ళ నొప్పులు తగ్గి, ఎముకలు బలోపేతం అవుతాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. పళ్ళు, చిగుళ్ళు బలంగా ఆరోగ్యంగా మారుతాయి. జుట్టు పెరుగుదల మెరుగుపడుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.

# చిరుధాన్యాలు కాదు ఆరోగ్యాన్నిచ్చే సిరిధాన్యాలు.. వదిలిపెట్టకండి

మన ఆరోగ్యం ఎవరి చేతులలోనూ ఉండదు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. ముఖ్యంగా మనం తినే ఆహారంలోనే ఉంటుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎంత సంపద ఉన్న ఆరోగ్యంగా లేకుంటే ఏం చేసినా, ఎంత సంపాదించినా వేస్ట్. ఆరోగ్యం లేకుంటే జీవితమే వృధా అవుతుంది. చిరు ధాన్యాలపై ప్రజలలో పెరిగిన అవగాహన మరి మనకు ఆహారం అనగానే పండ్లు ,కూరగాయలు,ఆకు కూరలే గుర్తొస్తాయి. కానీ ఈ మధ్య కాలంలో ఎక్కువగా ప్రాచుర్యం పొందుతున్న ఆహారం చిరు ధాన్యాలు. ఇటీవల కాలంలో జనాలకు వీటిపైన చాలా అవగాహన పెరిగింది. చాలా చోట్ల చిరుదాన్యాలతో తయారు చేసిన ఆహార ఉత్పత్తులు లభిస్తున్నాయి. చిరు ధాన్యాల టిఫిన్ సెంటర్లు వెలుస్తున్నాయి. ఇక చిరు ధాన్యాలతో పిండి వంటలు కూడా తయారు చేస్తున్నారు. చిరు ధాన్యాలలో వేటికవే స్పెషల్ ఇక ఎలాంటి చిరు ధాన్యాలతో మనం ఆరోగ్యంగా ఉంటామో తెలుసుకుందాం. చిరు ధాన్యాలలో కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు, అండ్రు కొర్రలు ఇలా చాలానే ఉన్నాయి. ఈ చిరు దాన్యాలన్నీ వేటికవే స్పెషల్. చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని భావించే వారు వీటిని ఒక టైం టేబుల్ ప్రకారం ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. చిరుధాన్యాలతో ఆరోగ్యం చిరు ధాన్యాలలో మన శరీరానికి కావలసిన బోలెడు మిటమిన్లు, పోషకాలు ఉంటాయి. చిరు ధాన్యాలు ముఖ్యంగా మన శరీరానికి కావాల్సిన పోషకాలను ఇవ్వటంతో పాటు మన శరీర బరువును తగ్గించటానికి చాలా బాగా ఉపయోగపడతాయి. అలాంటి ఆరోగ్యానిచ్చే వాటిలో రాగులు ఒకటి . ఇవి ఎముకలను బలంగా మారుస్తాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, అనీమియాను నివారిస్తాయి. రాగులు ఆహారంలో చేర్చుకుంటే ఆరోగ్యం రాగులను నానబెట్టి మొలకలు వచ్చాకా తినవచ్చు ఇలా తినడం వలన శరీరానికి మెరుగైన పోషకాలు అందుతాయి. ఆహారంలో రాగులను వివిధ రూపాల్లో



చేర్చుకోవచ్చు . రాగులను పిండిగా చేసుకుని రాగి జావ చేసుకోవచ్చు రాగిజావ మంచి పౌష్టికాహారం. రాగి పిండితో దోశ,ఇడ్లీలు కూడా చేసుకోవచ్చు. రాగి సంకటి చేసుకుని తిన్నా మంచిదే. గుండె సమస్యరాకుండా చేసే జొన్నలు ఇక చిరుదాన్యాలలో మరొక ముఖ్యమైన సిరి ధాన్యం జొన్నలు, ఈ చిరు ధాన్యాలు తినడం వలన హార్ట్ ను హెల్దీగా ఉంచుతాయి. మన శరీరంలో గుండె ప్రాధాన్యత అందరికీ తెలిసిందే. ఈ మధ్యకాలంలో చాలా మందిని హార్ట్ సమస్య వెంటాడుతుంది. ఇక హార్ట్ సమస్యను అరికట్టడానికి తృణ ధాన్యాలలో మేలైనవి జొన్నలు. శరీరంలో ఇమ్యూనిటీ నీ పెంచుతుంది. శరీరంలో అనేక మంచి మార్పులను తెస్తుంది. బరువు తగ్గించటంలో జొన్నల పాత్ర జొన్నలు అధిక బరువును నియంత్రిస్తాయి. బరువు తగ్గించటంలో జొన్నల పాత్ర చాలా కీలకం. చెడు కొలెస్ట్రాల్ ను కరిగిస్తుంది. షుగర్ లెవల్ ను పెరగకుండా అరికడుతుంది. జొన్నలని నానబెట్టి మొలకలుగా తినవచ్చు,లేదా జొన్నలను పిండిగా చేసి జొన్నరొట్టెల రూపంలో ఆహారంగా తినవచ్చు. జొన్న ఇడ్లీ, జొన్న దోశ వంటివి కూడా చేసుకుని తినవచ్చు. ఈ జొన్నలలో మాంసకృతులు అధికంగా ఉంటాయి. రక్తం పెరగటానికి తోడ్పడే ఇనుము ,క్యాల్షియం బి మిటమిన్లు ఉంటాయి. ఆరోగ్యానికి మేలు చేసే చిరు ధాన్యాలలో సజ్జలు స్పెషల్ ఫైబర్, మెగ్నీషియం పొటాషియం, జింక్ వంటి పోషకాలు సజ్జలలో పుష్కలంగా ఉంటాయి. అన్ని చిరు ధాన్యాలలో కెల్ల అధిక పోషకాలు సజ్జలలో ఉంటాయి..వీటిని ఆహారంలో చేర్చుకోవడం వలన జీర్ణశక్తి మెరుగుపడుతుంది. సజ్జలను ఆహారంలో చేర్చుకుంటే మల బద్ధకం సమస్య ఉన్నవారికి ఉపశమనం కలుగుతుంది. అలాగే గుండె సంబంధిత వ్యాధులను అరికడుతుంది గుండె జబ్బుల ప్రమాదం రాకుండా సజ్జలు కాపాడుతాయి. డయాబెటిస్ ఉన్న వారికి సజ్జలు సూపర్ ఫుడ్ రక్త ప్రసరణలో గ్లూకోజ్ ను నిదానంగా విడుదల అయ్యేలా చేస్తాయి సజ్జలు. రక్తపు చక్కర స్థాయిలను ఆకస్మికంగా పెరగకుండా సజ్జలు అరికడతాయి. ఇవి మధుమేహం వున్న వారికి లేదా మధుమేహం బారిన పడే అవకాశాలు ఉన్న వ్యక్తులకు మంచి ఆహారం. సజ్జలు మధుమేహం బారిన పడకుండా కాపాడతాయి. సజ్జలను అన్నంగా, సజ్జల జావగా, ఇడ్లీ, దోశ వంటివి చేసుకుని కూడా తీసుకోవచ్చు. ముఖ్యమైన సిరి ధాన్యం కొర్రలు ఇక చిరుధాన్యాలలో మరో ముఖ్యమైన ఆహారంగా కొర్రలు చెప్పవచ్చు. కొర్రలలో ప్రోటీన్, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు మరియు ఖనిజాలు సమపాళ్ళలో ఉండి ఆహారంలో భాగంగా తీసుకున్న వారికి మేలు చేస్తాయి. కొర్రలతో తినేవారికి బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. మధుమేహం,ఊబకాయం లాంటివి అస్సలు దరిచేరవు. ఊబకాయం, డయాబెటిస్ కు కొర్రలతో చెక్ బరువుని తగ్గించడంలో సహాయపడుతుంది. కోలన్ క్యాన్సర్ తో పాటు చాలా రకాల క్యాన్సర్ లను రాకుండా అరికడుతుంది .రక్తంలో చక్కెర స్థాయిలను అరికడుతుంది.

# మార్కెట్

## తగ్గనున్న వంటనూనెల ధరలు!
### క్రూడ్‌పై దిగుమతి సుంకాన్ని 10 శాతం తగ్గించిన కేంద్రం



న్యూఢిల్లీ : వంటనూనెల ధరలు మరింత తగ్గబోతున్నాయి. క్రూడ్ పామాయిల్, క్రూడ్ సోయబిన్ ఆయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్ నూనెలపై దిగుమతి సుంకాన్ని 10 శాతం వరకు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో దేశీయంగా వంటనూనెల రిటైల్ ధరలు మరింత తగ్గనున్నాయి. ఈ మూడు వంటనూనెలపై గతంలో 20 శాతం దిగుమతి సుంకాన్ని వసూలు చేసిన కేంద్రం..తాజాగా దీనిని 10 శాతానికి దించింది. దేశీయంగా వినియోగిస్తున్న వంటనూనెల్లో 50 శాతం దిగుమతులపై ఆధారపడుతున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో 159.6 లక్షల టన్నుల వంటనూనెలను దిగుమతి చేసుకున్నది. వీటి విలువ రూ.1.32 లక్షల కోట్లు. వంటనూనెల దిగుమతులపై తగ్గించిన దిగుమతి సుంకం వెంటనే అమలులోకి వచ్చిందని తెలిపింది. ఈ మూడు వంటనూనెలపై దిగుమతి సుంకం(బేసిక్ కస్టమ్ డ్యూటీ, ఇతర చార్జీలు) కలుపుకొని మొత్తంగా 27.5 శాతం వసూలు చేస్తుండగా, తాజా నిర్ణయంతో 16.5 శాతానికి దిగొచ్చింది. కానీ, రిఫైన్డ్ ఆయిల్‌పై వసూలు చేస్తున్న 32.5 శాతం దిగుమతి సుంకాన్ని యథాతథంగా ఉంచింది. వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఇండియన్ విజిటేబుల్ ఆయిల్ ప్రొడ్యుసర్స్ అసోసియేషన్ స్వాగతించింది. పెంచమంటే..తగ్గించారు.. దిగుమతి చేసుకునే వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని పెంచాలని కోరితే..కేంద్ర ప్రభుత్వం మాత్రం తగ్గించిందని ఎస్ఈఏ ప్రెసిడెంట్ మెహతా అస్థానా ఆందోళన వ్యక్తంచేశారు. దేశీయ ప్రాసెసింగ్ సంస్థలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దిగుమతి సుంకాన్ని 40 శాతానికి పెంచాలని గతంలోనే కేంద్రాన్ని కోరినప్పటికీ ప్రస్తుతం దీనిని 10 శాతానికి దించడం సబబుకాదని విమర్శించారు.

# ఆపిల్ నుంచి అదరిపోయేలా మడతపెట్టే ఫోన్..!



ఆపిల్ కంపెనీ చాలాకాలంగా 4-మోడల్ ఐఫోన్ సిరీస్‌ను కొనసాగిస్తున్నది. ఈ ఏడాది నుంచి మార్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆపిల్ ఈ ఏడాది ఐఫోన్ 17 ఎయిర్‌ను విడుదల చేయాలని యోచిస్తున్నది. ఇది ప్లస్ వేరియంట్‌ని భర్తీ చేయనున్నది. ఈ ట్రెండ్‌ను కొనసాగిస్తూ.. కంపెనీ 2026 కంపెనీ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ని విడుదల చేసే అవకాశం ఉన్నది. కొత్త బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. ఆపిల్ ఈ డివైజ్ కోసం క్లామ్‌షెల్ (ఫ్లిప్) డిజైన్ కాకుండా శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్ తరహాలో బుక్ స్టయిల్ డిజైన్‌ను తీసుకురానున్నది. నివేదిక ప్రకారం.. ఐఫోన్ ఫోల్డబుల్ శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్‌ని పోలి ఉండనున్నట్లు తెలుస్తున్నది. డిజైన్ ఐఫోన్ 17 ఎయిర్ నుంచి ప్రేరణగా తీసుకోనున్నది. ఆపిల్ త్వరలో తీసుకురానున్న ఐఫోన్ 17 ఎయిర్ అల్ట్రా సిమ్‌గా తెలుస్తున్నది. కేవలం 5.5 ఎంఎం మందం మాత్రమే ఉండనున్నట్లు తెలుస్తున్నది. దాంతో కెమెరా, స్పీకర్ క్వాలిటీలో రాజీ పడక తప్పదని నివేదిక పేర్కొంది. కానీ, బ్యాటరీ లైఫ్ ఐఫోన్ 16ఈ తరహాలోనే ఉంటుంది. ఇక ఐఫోన్ 17 ఎయిర్ వినూత్న డిజైన్‌ను ఆపిల్ భవిష్యత్ ఫోల్డబుల్ ఐఫోన్‌కు పునాదిగా భావిస్తున్నది. లీకుల ప్రకారం.. ఐఫోన్ ఫోల్డబుల్ పూర్తిగా తెరిచిన సమయంలో 7.8 ఇంచెస్ మెయిన్ డిస్‌ప్లే, 5.5 ఇంచెస్ ఎక్స్‌టర్నల్ స్క్రీన్‌తో వస్తుంది. స్ట్రాంగ్, డ్యూరబుల్‌తో ఫోన్‌ని తీసుకువచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందు కోసం లిక్విడ్ మెటల్‌ని ఉపయోగించనున్నట్లు సమాచారం. ఫోల్డబుల్ ఫోన్ ఓపెన్ చేసిన సమయంలో 4.5 ఎంఎం.. మతపెట్టిన సమయంలో 9 ఎంఎం నుంచి 9.5 ఎంఎం మందం ఉండనున్నది. ఇదే నిజమైతే ఇప్పటి వరకు ఉన్న ఫోల్డబుల్ ఫోన్‌లలో ఇదే స్లిమ్ ఫోన్‌గా మారనున్నది. ఇక ఆపిల్ ఫేస్ టచ్ ఐడీకి బదులుగా టచ్ ఐడీ సెన్సార్‌ను తీసుకురానున్నట్లు తెలుస్తున్నది. ఫోన్ క్వాలిటీని మెరుగుపరిచేందుకు టైటానియం ఛాసిస్‌ను ఉపయోగించవచ్చని తెలుస్తున్నది. దాంతో మొబైల్ తక్కువ బరువుతో ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ అందించనుంది. ఇప్పటి వరకు మొబైల్ స్పెసిఫికేషన్స్‌ను ఆపిల్ వెల్లడించలేదు. కేవలం ఇవన్నీ లీకులు మాత్రమే. ఇక ఈ మొబైల్ ధర అమెరికాలో 2,300 డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.1.91లక్షలుగా ఉండనున్నట్లు తెలుస్తున్నది.

## ఎస్బీఐ అమృత్ వృష్టి.. ఆకర్షణీయ వడ్డీతో ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఈ నెల 1 నుంచి తమ పాపులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) పథకం అమృత్ కలశ్‌ను ఆపేసింది. అయితే మరో ప్రత్యేక ఎఫ్‌డీ అమృత్ వృష్టిని కొనసాగిస్తున్నది. ఇందులో డిపాజిట్‌దారులకు మరింత వడ్డీ ఆదాయం లభిస్తుండటం విశేషం. దీని కాలపరిమితి 444 రోజులు. రెగ్యులర్ ఇన్వెస్టర్లకు వార్షిక వడ్డీరేటు 7.25 శాతం వర్తిస్తుంది. సీనియర్ సిటిజన్లకు మాత్రం 7.75 శాతం వడ్డీ వస్తుంది. ఇక 80 ఏండ్లు దాటినవారికైతే ఇది 7.85 శాతంగా ఉండటం గమనార్హం.

ప్యాట్రన్స్, వుయ్-కేర్

ఎస్బీఐ పరిచయం చేసిన కొత్త టర్మ్ డిపాజిట్ సదుపాయమే ఈ 'ప్యాట్రన్స్'. 80 ఏండ్లు, ఆపై వయసు కలిగినవారికే ఈ ప్రత్యేక ఎఫ్‌డీ అందుబాటులో ఉంటుంది. దీనిపై వార్షిక వడ్డీరేటు గరిష్ఠంగా 10 శాతం అందుకోవచ్చు. అలాగే 'వుయ్-కేర్' పేరిట 5-10 ఏండ్ల ఎఫ్‌డీలకు సీనియర్ సిటిజన్ల కోసం 7.50 శాతం వడ్డీనిస్తున్నది.



# మండలిలో ఫోటోలతో శ్రీవారికి అపచారం

## లడడూలో వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పింది

## లడ్డూ గురించి మాట్లాడితే హెరిటేజ్‌ను ముందుకు తెచ్చారు

## తప్పు చేసిన ఎవ్వరినీ వదలబోనన్న సిఎం చంద్రబాబు



పల్నాడు,ఫిబ్రవరి21 : చెప్పులు వేసుకుని వేంకటేశ్వరస్వామి ఫొటోలను మండలిలో వైకాపా సభ్యులు విసిరేశారని సిఎం చంద్రబాబు మండిపడ్డారు. శ్రీవారి విషయం బయట మాట్లాడకూడదని రెండు రోజులుగా ఆగానన్నారు. వేంకటేశ్వరస్వామి స్వయంగా తనను కాపాడారని.. వేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. ఏపీ శాసనమండలిలో వేంకటేశ్వర స్వామి ఫొటోలతో వైసీపీ సభ్యులు చేసిన నిరసనలపై సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ అంశంపై వినుకొండ సభలో సీఎం మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూను అపవిత్రం చేశారని చెబితే హెరిటేజ్‌ను తెరపైకి తీసుకొచ్చారన్నారు. 'నేను ప్రాణం పోయినా తప్పు చేయను' అని స్పష్టం చేశారు. లడ్డూ ప్రసాదానికి వాడింది నెయ్యే కాదని సిట్ చెప్పిందన్నారు. తప్పు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న ÷ర్ అయ్యారు. తప్పును పక్క వాళ్లపై నెట్టే నీచులు కూడా ఉన్నారన్నారు. అలాంటి కరుడుగట్టిన నేరస్థుడితో రాజకీయం చేయాలా అని విమర్శించారు. తాను కూడా జైలుకు వెళ్తానని ఊహించలేదని.. నోటీసు ఇస్తే సమాధానం చెప్పేవాడినని సీఎం చంద్రబాబు అన్నారు. 'నా ప్రాణం పోయినా పరవాలేదు... రాష్ట్రం కోసం పోరాడతాను' అని చెప్పుకొచ్చారు. చాలా మంది తాను జైల్లో నుంచి ప్రాణాలతో బయటకురారని అనుకున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కొందరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా బూతులు మట్లాడుతున్నారని.. రెచ్చగొట్టే పనులు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. డ్రగ్స్ మత్తులో ఆడబిడ్డల జోలికొస్తే వారికదే చివరిరోజు అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వివేకా హత్యను గుండె పోటు అని నమ్మించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నారాసుర రక్త చరిత్ర అంటూ తనపై నెపం నెట్టారని.. వివేకా హత్య చుట్టూ నాటకాల రాయుడు నాటకాలు ఆడారంటూ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సులో కాంగ్రెస్ తీరు ఆవేదన కలిగించిందన్నారు. కాంగ్రెస్ తీరు దేశానికి మంచిది కాదన్నారు. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనించాలని తెలిపారు. దేశానికి మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు

# క్యాతన్‌పల్లిలో బిఆర్ఎస్ జెండా ఎగరేస్తాం

## బాల్క సుమన్ తదితరులపై కేసులు ఎత్తేయాలి

## మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్

మంచిర్యాల,ఫిబ్రవరి21 : జిల్లాలోని క్యాతనపల్లిలో బాల్కసుమన్ తో పాటు బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు,చందర్, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేని శంకర్ మాట్లాడారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని అన్నారు.తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తున్నాడని ఆరోపించారు.క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులలో బీఆర్ఎస్, సీపీఐ కూటమి 14 వార్డులు గెలుచుకోగా ప్రజాస్వామ్యబద్ధంగా జరుగవలసిని చైర్మన్ ఎన్నికను మంత్రి వివేక్, ఎంపీ వంశీ అడ్డుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ డమ్మీ కమిషన్ మారిందని,బాల్క సుమన్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులపై మంత్రి వివేక్ ప్రోద్బలంతో పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. క్యాతన పల్లి మున్సిపాలిటీ చేజిక్కించు కావాలన్న కుట్రలతో బీఆర్ఎస్, సీపీఐ కూటమి కౌన్సిలర్లను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి వివేక్ ఆదేశాలతో సింగరేణి అధికారులు క్యాతన పల్లి మున్సిపాలిటీ 11 వ వార్డు కౌన్సిలర్ భీమాగౌడ్ ఇంటిపై దాడి చేసి, కుటుంబసభ్యులపై దౌర్జన్యం చేశారని తెలిపారు. భీమాగౌడ్ తో కుటుంబానికి బీఆర్ఎస్ తరపున అండగా ఉంటామని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మాట్లాడుతూ రాజ్యాంగం పట్టుకొని తిరుగుతున్న రాహుల్ గాంధీకి రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. మంత్రి వివేక్ రేవంత్ తో తిరిగి దొంగలా మారిండని,సింగరేణి అధికారులు కాంగ్రెస్ కండువాలు కప్పుకొని కాంగ్రెస్ ఎమ్మెల్యే చెప్పినట్లు పనిచేస్తున్నారని విమర్శించారు. చెన్నూరు నియోజకవర్గంలో ఎమర్జేసి పాలన నడుస్తున్నదని ఆరోపించారు.టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ కౌన్సిలర్ భీమాగౌడ్ కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు.

# మండలిలో స్వామివారికి వైసిపి అపచారం

## ఇది ముమ్మాటికి దైవద్రోహమే

## టిటిడి సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి ఆగ్రహం

తిరుపతి,ఫిబ్రవరి21 : శాసనమండలిలో వైసీపీ నేతలు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి పట్ల చూపిన వ్యవహారాన్ని టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఇది దైవద్రోహం..అపచారం' అని మండిపడ్డారు. శాసనమండలిలో వైసీపీ నేతలు చెప్పులు, బూట్లు వేసుకుని వేంకటేశ్వర స్వామి ఫోటోలు పట్టుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి కళ్లల్లో ఆనందం చూడాలని, ఆయనను సంతృప్తి పరిచేందుకు నేతలు వ్యవహరించిన తీరు దురదృష్టకరమని మండిపడ్డారు. 'మీరు వేంకటేశ్వర స్వామి భక్తులా? యేసు భక్తులా?' సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్వామి భక్తులైతే ఈ విధంగా ప్రవర్తించరని ఆయన అన్నారు.వైసీపీ నేతలకు బుద్ధి లేదని భానుప్రకాశ్ రెడ్డి విమర్శించారు. 2019 నుంచి 2024 వరకు టీటీడీని టా÷-గ్గ్÷ట్ చేసి దాడులు చేశారని గుర్తు చేశారు. వైసీపీ నేతలు చెప్పులు వేసుకొని వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని తీసుకువెళ్లిన సంఘటనపై న్యాయ నిపుణులతో మాట్లాడానని, స్వామివారి పట్ల అపచారం చేసిన వారికి లీగల్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. హిందువులను గౌరవించే వ్యక్తి అయితే జగన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచే దీనికి డైరెక్షన్ జరిగిందని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా హిందూ ధర్మాన్ని, దేవాలయాలను అవహేళన చేసే విధంగా వ్యవహరించారని ఆయన మండిపడ్డారు. శాసనమండలి పెద్దల సభను వైసీపీ నేతలు 'రాక్షస సభ'గా మార్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ ధర్మంపై విష ప్రచారం చేస్తున్నారన్ని ÷ర్ అయ్యారు. నిన్నటి సంఘటనపై జగన్‌మోహన్ రెడ్డి సహా అందరూ క్షమాపణ చెప్పాలని, అలిపిరికి వచ్చి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పవిత్రమైన ఏడుకొండలపై కొలువైన స్వామితో ఆటలాడుకోవడం మంచిది కాదని... గతంలో విమర్శించిన వారు మాడి మసైపోయారని హెచ్చరించారు. వేంకటేశ్వర స్వామి ఆగ్రహం వల్లే వైసీపీ 11 స్థానాలకు పరిమితమయ్యారని భానుప్రకాశ్ వ్యాఖ్యలు చేశారు. అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ అని.. వారిలో మొదటి స్థానంలో భూమన కరుణాకర్ రెడ్డి ఉన్నారని భాను ప్రకాశ్ ఎద్దేవా చేశారు. కరుణాకర్ రెడ్డి సిట్ విషయంలో మాట్లాడిన దానిలో వాస్తవం లేదని అన్నారు. వైవీ సుబ్బారెడ్డి నెయ్యి కొనుగోలులో మార్పులు చేసినప్పుడు భూమన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. వైసీపీ నేతలు హిందూ ద్రోహులుగా మిగిలిపోతారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫ్యాన్ తిరగే పరిస్థితి లేదన్నారు. ఎన్‌డీఏ కూటమిని అడ్డుకోలేకనే టీటీడీని అడ్డుపెట్టుకుని డ్రామాలు చేస్తున్నారని భాను ప్రకాశ్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.

# ఆయేషా మీరా హత్య కేసు ముగింపు

## విజయవాడ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు

## అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగింత!

## ఫిబ్రవరి 27న తెనాలిలో అంత్యక్రియలు

అమరావతి, ఫిబ్రవరి 21 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో విజయవాడలోని సీబీఐ ప్రత్యేక కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తును ముగిస్తున్నట్లు ప్రకటించిన న్యాయస్థానం.. వైద్య బృందం సేకరించిన ఆయేషా భౌతిక అవశేషాలను ఆమె తల్లిదండ్రులకు అప్పగించాలని సీబీఐని ఆదేశించింది. ఫిబ్రవరి 27న తెనాలిలో ప్రభుత్వ భద్రత నడుమ మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆయేషా హత్య కేసులో నిందితులను గుర్తించడానికి తగిన ఆధారాలు లభించలేదని సీబీఐ ఇటీవల కోర్టుకు తుది నివేదిక సమర్పించింది. ఈ నివేదికను తాజాగా న్యాయస్థానం ఆమోదించింది. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయేషా మీరా మృతదేహానికి రెండో సారి పోస్టుమార్టం నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి వైద్యుల అభిప్రాయం తీసుకున్న అనంతరం అవశేషాలను సీబీఐ కోర్టు ముందుంచారు. ఈ క్రమంలో తమ కుమార్తె అవశేషాలను అంత్యక్రియల నిమిత్తం తమకు అప్పగించాలని కోరుతూ ఆయేషా తల్లిదండ్రులు షంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, ఫిబ్రవరి 27వ తేదీ తెనాలిలో అంత్యక్రియలు జరపాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని సీబీఐ, రెవెన్యూ, పోలీసు అధికారులు, మత పెద్దల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అవశేషాల తరలింపునకు ప్రత్యేక వాహనం, ఎస్కార్ట్, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2007లో విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలోని హాస్టల్‌లో ఆయేషా మీరా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే.

# కామారెడ్డి ఎమ్మెల్యే ఆఫీస్ ముట్టడి

## కాంగ్రెస్ కార్యకర్తల దాడితో ఉద్రిక్తత

## పరస్పరం దాడి చేసుకున్న బిజెపి, కాంగ్రెస్ కార్యకర్తలు

## పోలీసులు రంగోలకి దిగడంతో అదుపులోకి పరిస్థితి

కామారెడ్డి,ఫిబ్రవరి21 : కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి కారును భాజపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైటెన్షన్ నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య మాటల యుద్ధం ఉద్రిక్తతలకు దారితీసింది. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నేత గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ప్రయత్నించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ప్రభుత్వ, అరోరా కాలేజీ భూములను వెంకట రమణారెడ్డి కబ్జా చేశారని షబ్బీర్ ఇటీవల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన వెంకట రమణారెడ్డి.. ప్రభుత్వ కాలేజీ భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజీ విషయంలో కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై తాను చర్చకు సిద్ధమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉందని.. సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాలు విసిరారు. ఈ నేపథ్యంలో శిశుమందిర్ వేదికపై బహిరంగ చర్చకు రెండు పార్టీలు సిద్ధమయ్యాయి. ఇరు పార్టీల నేతల సవాళ్లతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి క్యాంప్ ఆఫీసు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యాంప్ ఆఫీసు నుంచి బయటకు రాకుండా ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేశారు. మరోవైపు సవాలును స్వీకరించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన బీజేపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ముదరడంతో మహేందర్ రెడ్డి కారుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారును బోల్తా పడేశారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరు పార్టీల నేతలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం

## వాసుదేవరెడ్డిని అదుపులోకి తీసుకున్న సిట్

అమరావతి,ఫిబ్రవరి21 : మద్యం కుంభకోణం కేసులో.. విచారణను సిట్ వేగవంతం చేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారుల్లో ఒకరైన వాసుదేవరెడ్డిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రూ. 3,500 కోట్ల మేర అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఈ కేసులో వాసుదేవరెడ్డి అరెస్ట్ అత్యంత కీలకంగా మారింది.వాసుదేవరెడ్డి వైసీపీ హయాంలో బెవరేజెస్ కార్పొరేషన్‌లో కీలక బాధ్యతల్లో ఉండి, మద్యం పాలసీ రూపకల్పన, కంపెనీల ఎంపికలో కీలక పాత్ర పోషించినట్లు సిట్ అధికారులు నిర్ధారించారు. మద్యం కుంభకోణంలో వాసుదేవరెడ్డిని రెండో నిందితుడిగా (ఎ2) సిట్ అధికారులు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయన కొన్ని మద్యం కంపెనీలకు లబ్ది చేకూర్చారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ.. సిండికేట్లకు మేలు చేస్తూ వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లు సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి వాసుదేవరెడ్డి ఇప్పటికే కింది కోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కోర్టు బెయిల్ నిరాకరించడంతో ఆయన ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో విచారణ జరుగుతుండగానే పోలీసులు ఆయన్ని అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఈ కేసులో కీలక వ్యక్తుల పేర్లు బయట పెట్టేందుకు వాసుదేవరెడ్డి 'అప్రూవర్' గా మారే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఆయన అప్రూవర్‌గా మారితే.. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది బయటకు వచ్చే అవకాశం ఉంది. వాసుదేవరెడ్డి అరెస్ట్‌తో ఏపీ రాజకీయాల్లో వేడి రాజుకుంది. మద్యం సరఫరాలో జరిగిన అవకతవకలు, డిజిటల్ పేమెంట్లకు అవకాశం ఇవ్వకుండా నగదు రూపంలో జరిగిన లావాదేవీలపై సిట్ అధికారులు దృష్టి సారించారు. ఆయన అరెస్ట్ తర్వాత మరికొంత మంది అధికారులు, రాజకీయ నేతలకు నోటీసులు అందే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి

కరీంగనర్,ఫిబ్రవరి21 : కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి రాజీవ్ రహదారిపై బైక్ ను కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై వెళ్తోన్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. హుస్నాబాద్ నుంచి తోటపల్లికి వెళ్తుండగా కొత్తపల్లి దగ్గర ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో కాసేపు హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. స్తానికుల సమాచారంతో ఘటనా స్తలానికి వచ్చిన పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులు అవదూత శ్రీనివాస్, శ్రీరామ రామచంద్రంగా గుర్తించారు. వీరిద్దరూ బొమ్మనపల్లి మండలం చిరుగుమామిడి గ్రామస్తులుగా గుర్తించారు పోలీసులు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో స్తానికులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# ప్రతి కుక్కకూ ఓ రోజు వస్తుంది

## ఎన్ని కేసులు పెట్టినా, చావనైనా చస్తాను

## ఎట్టిపరిస్థితుల్లో నేను తగ్గనే తగ్గను

## వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు

అమరావతి, ఫిబ్రవరి 21 : వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ప్రతి కుక్కకూ ఒక రోజొస్తుంది. ఈ రాంబాబు అనే కుక్కకు కూడా ఓ రోజు వస్తుంది. అప్పుడు తగ్గనే తగ్గను' అని ఆయన ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఆయన, బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. అనంతరం నిన్న గుంటూరులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మీడియా సమావేశానికి ముందు, ఆయన తాడేపల్లిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. తనపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయించారని జగన్‌కు వివరించారు. దీనిపై స్పందించిన జగన్, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయపోరాటం చేద్దామని భరోసా ఇచ్చారు. మీడియాతో మాట్లాడుతూ, తాను ఆవేశంలో అన్న మాటలపై రియలైజ్ అయ్యానని తెలిపారు. జైలు జీవితాన్ని ఎంజాయ్ చేశానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. తన పోరాటం మాత్రం ఆగదని స్పష్టం చేశారు. 'ఎన్ని కేసులు పెట్టుకున్నా తగ్గను. చావనైనా చస్తాను గానీ, తగ్గే ప్రసక్తే లేదు' అని పేర్కొన్నారు.

# కార్లతో ర్యాలీతో నోటీసుల ఉల్లంఘన..

## అంబటి రాంబాబు, జక్కంపూడి రాజాలపై కేసు నమోదు

అమరావతి, ఫిబ్రవరి 21 : మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుపై మరో కేసు నమోదయింది. ఆయనతో పాటు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పలువురు వైసీపీ నేతలపై కూడా రాజమండ్రి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ఇచ్చిన నోటీసులను ధిక్కరించి భారీ ర్యాలీ నిర్వహించడంతో వివిధ సెక్షన్ల కింద కేసు ఫైల్ చేశారు. ఈ కేసును రాజమండ్రి ప్రకాశ్ నగర్ సీఐ బాజీలాల్ విచారణ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... 18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబు రెండు రోజుల క్రితం బెయిల్ పై విడుదలైన సంగతి తెలిసిందే. ఈనెల 19న రాజమండ్రి నుంచి గుంటూరుకు బయలుదేరిన అంబటి రాంబాబుకు పోలీసులు సెక్షన్ 30 కింద నోటీసులు అందించారు. కార్లతో భారీ ఊరేగింపు నిర్వహించవద్దని, రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై అధిక వాహనాలతో వెళ్లకూడదని నోటీసులో పేర్కొన్నారు. అయినప్పటికీ అంబటి, జక్కంపూడి రాజా తమ అనుచరులతో కలిసి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో వారిపై కేసులు నమోదయ్యాయి.

# తిరుమలలో పోటెత్తిన భక్తులు..

## సర్వదర్శనానికి 20 గంటల సమయం

తిరుమల, ఫిబ్రవరి 21 : తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కొండపై భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం ఉదయం వెల్లడించిన వివరాల ప్రకారం, శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. గురువారంతో పోలిస్తే దర్శన సమయం 10-12 గంటల నుంచి ఒక్కసారిగా 20 గంటలకు చేరడం రద్దీ తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు, రానున్న వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, దర్శన సమయాన్ని తగ్గించే లక్ష్యంతో టీటీడీ అదనపు ఈవో ఆధ్వర్యంలో నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. డేటా ఆధారిత వ్యూహంతో రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ఎమ్మెల్యే జివి ఆసక్తికర వ్యాఖ్యల

## 50కోట్లు అనడానికి బదులు 50వేల కోట్లు అంటూ వ్యాఖ్య

## సరిదిద్ది నవ్వుకున్న చంద్రబాబు

పల్నాడు,ఫిబ్రవరి 21 : వినుకొండలో సీఎం చంద్రబాబు పర్యటనలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఎం బహిరంగ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రసంగిస్తూ.. వినుకొండలో పార్కు, స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం కోసం రూ.50 వేల కోట్లు నిధులు కేటాయించాలని అన్నారు. అది విన్న సీఎం చంద్రబాబు నవ్వులు చిందించారు. అనంతరం ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను సరిదిద్దుకొని రూ.50 కోట్లు కేటాయించాలని కోరారు. ఈ వ్యాఖ్యలతో అక్కడున్న టిడిపి వారు కూడా నవ్వులు చిందించారు.

లస్యా చిత్రం





# సరస్వతి కాళికాదేవిలా మారితే!

ప్రతి అమ్మాయి ఒక సరస్వతిలా ఉండదు. అవసరమైతే కాళికలా కూడా మారుతుందంటూ తనదైన శైలిలో హెచ్చరించింది ఓ యువతి. ఆమె ఎందుకలా చెప్పింది? అసలు సరస్వతి ఎవరు? కాళిలా మారి కన్నెర్రజేయాల్సిన అవసరం ఎవరికి, ఎందుకొచ్చిందో తెలియాలంటే 'సరస్వతి' చూడాల్సిందే. ప్రముఖ నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రమిది. తన సోదరి పూజా శరత్ కుమార్‌తో కలిసి దోస డైరీస్ పతాకంపై నిర్మించారు. ఈటీవీ విన్ సమర్పిస్తోంది. ప్రియమణి, ప్రకాశ్‌రాజ్ తదితరులు కీలక పాత్రల్ని పోషించారు. హై కాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం మార్చి 6న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని డిజిటల్ వేదికల్లో కథానాయకుడు నాని, శనివారం నిర్వహించిన వేడుకలో దర్శకుడు గోపీచంద్ మలినేని విడుదల చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ "మహిళా ప్రధానమైన సినిమా అని సందేశం ఇచ్చినట్టుగా ఉండదు ఈ చిత్రం. థ్రిల్లింగ్‌గా సాగుతూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుంది. తెలుగులో నటిగా నన్ను పునః పరిచయం చేసి రెండో జీవితాన్నిచ్చారు గోపీచంద్ మలినేని. ఆయన ఈ వేడుకకు రావడం ఆనందంగా ఉంది. చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదిగేందుకు అందరూ మరింతగా సహకారం అందించాలని కోరుకుంటున్నా" అన్నారు. వేదికపై వరలక్ష్మి భావోద్వేగానికి గురయ్యారు. గోపీచంద్ మలినేని మాట్లాడుతూ "నేను తీసిన 'క్రాక్'లో జయమ్మ పాత్రని పోషించిన వరలక్ష్మీ శరత్‌కుమార్‌ని చూసి మా ప్రకాశం జిల్లా వాసులంతా షాక్ అయ్యారు. జయమ్మ అంటే ఇలాగే ఉంటుందేమో అనుకున్నారు. సావిత్రి, శారదలా మంచి నటి వరలక్ష్మి. ఆమె 'సరస్వతి' కథని చెప్పిన విధానంతో నేను ఆశ్చర్యపోయా. థియేటర్లో ఈ సినిమా చూసి అందరూ షాక్ అవుతారు.



# ఒకేసారి నాలుగు చిత్రాలతో విక్రమ్

పాత్రలతో ప్రయోగాలు చేసే కథానాయకుల్లో ముందు వరుసలో ఉంటారు హీరో విక్రమ్. ఈ మధ్య కాలంలో 'తంగలాన్', 'వీర ధీర శూర' లాంటి వైవిధ్యమైన సినిమాలతో అలరించినా.. ఏదీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని సాధించలేకపోయింది. కానీ ఈ ఏడాది అదిరిపోయే కథలతో రావడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారాయన. తాజాగా విక్రమ్.. ఒకేసారి నాలుగు చిత్రాల్ని ప్రకటించి సినీప్రియుల్ని ఆశ్చర్యపరిచారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన వివరాల్ని పూర్తిగా వెల్లడించనప్పటికీ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఈ విషయం గురించి ఓ పోస్ట్ పెట్టారాయన. "కొన్నిసార్లు నిశ్శబ్దం కూడా ఒకలాంటి ప్రిపరేషన్ లాంటిదే. ఈ సంవత్సరం నన్ను కదిలించే కథల కోసం ఎదురుచూస్తూ గడిపాను. నేను ఎంతో ఆరాధించే దర్శకులతో విభిన్నమైన నాలుగు చిత్రాలతో రాబోతున్నాను. ఈ ప్రయాణాలను మీతో పంచుకోవడానికి వేచి ఉండలేన"ని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.



# ధురంధర్ 2 యాక్షన్ ట్రీట్?

గతేడాది బాక్సాఫీసు వద్ద వసూళ్ల మోత మోగించిన 'ధురంధర్' సీక్వెల్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు సినీప్రియులు. ఇప్పుడు వారందరికీ ట్రైలర్‌తో మరోసారి యాక్షన్ హంగామాని రుచి చూపించడానికి సన్నాహాలు చేస్తోందట చిత్రబృందం. బాలీవుడ్ కథానాయకుడు రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమే 'ధురంధర్ 2'. ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను మార్చి మొదటి వారంలో విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. "ధురంధర్ 2'.. ప్రతి సన్నివేశంలోనూ మొదటి భాగాన్ని మించేలా ఉంటుంది. ఇప్పుడు రాబోయే ట్రైలర్ యాక్షన్ ట్రీట్‌లా ఉంటుంది అభిమానులకు. యాక్షన్ నుంచి భావోద్వేగాల వరకూ.. ప్రతిదీ మునుపెన్నడూ చూడని విధంగా ఉంటుంద"ని రణ్‌వీర్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. జియో స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ సీక్వెల్ మార్చి 19న థియేటర్లలోకి రానుంది.

# విష్ణు విన్యాసం.. ఒకరోజు ముందుగానే



కథానాయకుడు శ్రీవిష్ణు వారం వ్యవధిలోనే వరుసగా రెండు సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించనున్నారు. ఇప్పటికే ఆయన నటించిన 'మృత్యుంజయ్' మార్చి 6న రానున్నట్లు ప్రకటించగా.. ఇప్పుడు మరో సినిమా 'విష్ణు విన్యాసం' కూడా కొత్త తేదీని ఖరారు చేసుకుంది. నిజానికి దీన్ని ఈనెల 28న విడుదల చేయనున్నట్లు తొలుత ప్రకటించారు. కానీ, దీన్నిప్పుడు ఒకరోజు ముందుగానే ఈనెల 27న థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. "ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ప్రేమకథా చిత్రమిది. శ్రీవిష్ణు ఇందులో జాతకాల పిచ్చి ఉన్న ఫన్నీ పాత్రలో అలరించనున్నారు" అని చిత్ర వర్గాలు తెలిపాయి. యదునాథ్ మారుతీ రావు తెరకెక్కించిన ఈ సినిమాని సుమంత్ నాయుడు.జి నిర్మించారు. నయన్ సారిక కథానాయిక. సత్య, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రధన్ సంగీతమందించారు.



# తిప్పుకుంటన్నావ్.. నన్నే నీ సుట్టూ!

'కోర్ట్' విజయం తర్వాత హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన కొత్త చిత్రం 'బ్యాండ్ మేళం'. కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థ నిర్మించింది. సతీశ్ జవ్వాజీ తెరకెక్కించారు. సాయికుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా మార్చి 13న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు అనిల్ రావిపూడి శనివారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "తిప్పుకుంటన్నావ్.. నన్నే నీ సుట్టూ తిప్పు తిప్పేస్కుంటన్నావ్" అంటూ సాగిన ఈ మాస్ పాటకు విజయ్ బుల్గానిన్ స్వరాలందించగా.. చంద్రబోస్ సాహిత్యమందించారు. రాము రాథోడ్, అదితి భవరాజు ఆలపించారు. ఈ పాటలో హర్ష్, శ్రీదేవి వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. "గ్రామీణ నేపథ్యంలో సాగే ఫీల్‌గుడ్ ప్రేమకథతో రూపొందిన చిత్రమిది. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంద"ని చిత్ర వర్గాలు తెలిపాయి.



# భోగి.. పోరు బాటలో

'నారీ నారీ నడుమ మురారి' విజయంతో జోరు మీదున్నారు హీరో శర్వానంద్. ఇప్పుడాయన సంపత్ నంది దర్శకత్వంలో 'భోగి' అనే పాన్ ఇండియా సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. కేకే రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ఓ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. తాజాగా హైదరాబాద్‌లో మరో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు శనివారం ప్రకటించారు. దీనిలో భాగంగా ప్రత్యేకంగా సిద్ధం చేసిన భారీ సెట్‌లో రెండు భారీ పోరాట ఘట్టాల్ని తెరకెక్కించనున్నారు. దీనికి దిలీప్ సుబ్బరాయన్ కొరియోగ్రఫీ చేస్తున్నట్లు చిత్ర వర్గాలు ప్రకటించాయి. దీనికి సంబంధించి శర్వా పంచెకట్టులో చేతిలో సుత్తితో నిల్చొని ఉన్న వర్కింగ్ స్టిల్‌ను నెట్టింట పంచుకున్నారు. "1960 నేపథ్యంలో సాగే రా రస్టిక్ యాక్షన్ చిత్రమిది. శర్వా దీంట్లో ఓ సరికొత్త లుక్‌లో అలరించనున్నారు" అని దర్శక నిర్మాతలు తెలిపారు.





# బాలీవుడ్‌ని వదిలి వెళ్లాలని ఎప్పుడూ అనుకోలేదు!

హాలీవుడ్, బాలీవుడ్.. ఈ రెండు పరిశ్రమలలో పనిచేయడం తనకెంతో సంతోషమని అంటోంది అందాల తార ప్రియాంక చోప్రా. త్వరలో 'వారణాసి' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతోంది భామ. మరోవైపు హాలీవుడ్ చిత్రాలతోనూ బిజీగానే గడుపుతోంది. ఇందులో భాగంగానే ఆమె నటించిన 'ది బ్లఫ్' ఈ నెల 25న రాబోతుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రియాంక హాలీవుడ్‌కి వెళ్లడం గురించి తన మనసులోని మాటల్ని బయట పెట్టింది. "నేను బాలీవుడ్‌ని వదిలి వెళ్లాలని ఎప్పుడూ అనుకోలేదు. హిందీ చిత్రాలలో పనిచేస్తున్నప్పుడు కొన్ని కారణాల వల్ల నాకు పరిమితమైన అవకాశాలు వచ్చాయనే భావన కలిగింది. ఒక నటిగా నాకు ఉత్సాహాన్నిచ్చే ప్రాజెక్టులను వెతకడంలో చాలా ఒత్తిడికి గురయ్యాను. ఇలాంటి పరిస్థితుల్లో హాలీవుడ్‌లోకి అడుగుపెట్టాను. నాకు భారతీయ సినిమాలంటే చాలా ఇష్టం. మళ్లీ ఇక్కడ 'వారణాసి' చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. హాలీవుడ్, బాలీవుడ్ ఈ రెండింటిలో ఒకదాన్నే ఎంచుకోమంటే... దానికి అస్సలు ఇష్టపడను. ఈ రెండు పరిశ్రమల సంస్కృతులు ఎలా భిన్నంగా ఉంటాయో.. పని చేయడం కూడా అలాగే విభిన్నంగా ఉంటుంది. ఇలా ఒకే సమయంలో రెండు చోట్లా పనిచేయడం ఓ సరదా అనుభవం" అని చెప్పుకొచ్చింది ప్రియాంక.

# ప్రగ్యా మౌనం.. మౌనం!

టాలీవుడ్‌లో ఒక్క సినిమా హిట్టయితే చాలు.. హీరోయిన్ల దశ తిరిగిపోతుంది. కానీ, కొందరికి అదృష్టం మాత్రం అంత ఈజీగా తలుపు తట్టదు. ప్రగ్యా జైస్వాల్ విషయంలో ఇప్పుడు ఇదే జరుగుతోంది. వరుసగా బ్లాక్ బస్టర్ హిట్లు తన ఖాతాలో ఉన్నా, అవకాశాల విషయంలో మాత్రం ఈ అమ్మడు వెనుకబడిపోయింది.

టాలీవుడ్‌లో 'కంచె' సినిమాతో పద్ధతిగా ఎంట్రీ ఇచ్చి అందరినీ మెప్పించిన భామ ప్రగ్యా జైస్వాల్. ఆ తర్వాత 'నక్షత్రం' వంటి చిత్రాల్లో తన గ్లామర్ యాంగిల్ కూడా చూపించింది. ఇక బాలయ్యతో చేసిన 'అఖండ' సినిమా ఆమె కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. 2025 సంక్రాంతికి విడుదలైన 'డాకు మహారాజు'తో పాటు ఇటీవల విడుదలైన 'అఖండ-2' లోనూ కనిపించి మెప్పించింది. ఇన్ని పెద్ద హిట్లు ఉన్నా, ప్రగ్యాకు కొత్త ప్రాజెక్టులు రాకపోవడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమా అవకాశాలు తగ్గడంతో ప్రగ్యా తన రూట్ మార్చింది. ప్రస్తుతం ఈమె తన పూర్తి ఫోకస్‌ను సోషల్ మీడియాపై పెట్టింది. నిత్యం ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉంటూ, గ్లామరస్ ఫొటో షూట్లతో నెటిజన్లకు నిద్ర లేకుండా చేస్తోంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787